# "శుభికే శిర ఆరోహ"

[ కథ ]

= శ్రీ శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి =

౧

"ఫ్రూరీ పాసెంజర్లో వస్తున్నా" నని యేలూరి నుంచి గంగమ్మ రాసిన వుత్తరమూ, "నాలుగ్గంటల రెయిలుకార్లో వస్తున్నా" నని కాకినాడనుంచి రంగమ్మ రాసిన వుత్తరమూ, ఆవేళ ఆదివారం కావడంవల్ల వొక్క డెలివరీలోనే అందాయి.

"టపా చూసుకునే పైకి వెడదా" మనుకుని, ఆఫీసుగదిలో కూచుని వున్నాడు జగ్గప్ప.

ఏకక్షీదారో, యేబంధువో, యేమిత్రుడో, యే తెనుగురచయితో రాసిన మామూలు జాబులే వస్తాయనీ, వెంటనే మేడమీదకి వెళ్లి సుఖంగా నిద్రపోవచ్చు ననీ అనుకున్నా డతను.

కాని, దినదినమూ యెన్నో వచ్చే వుత్తరాలివాళ రెండే రావడమూ, ఆరెండయినా "కజ్జాకి వస్తున్నాం కాసుకో" అన్నట్టిలాగ శ్రీముఖా లయి వుండడమూ చూసి తెల్లపోయి, ఉన్నట్టుండగా కుర్చీకి అంటుకుపోయాడు.

ఆవుత్తరాలతో పాటే వచ్చి బిందెరొట్టిలాగ మేజామీద పడివున్న లారిపోర్టు పాకెట్టయినా అతన్ని ప్రకృతిస్థుణ్ణి చెయ్యలేకపోయింది.

ఈస్థితిలో తాంబూలం పట్టుకుని రత్తమ్మ చక్కావచ్చింది.

గుమ్మంలో అడుగు పెట్టాటప్పటికే ఆ జడావస్థ కనపడగా "యేమిటా?" అని పరిశీలించడంలో నిశితాలయిన ఆమెచూపులతో ఉద్బుద్ధు డయినా డతను.

ఉత్తరక్షణంలో వుత్తరాలూ, తాంబూలమూ మార్చుకున్నారు వారు.

చూస్తూ చూస్తూ వుండగానే, అతని పెదవులు రాగరంజితాలు కాగా, ఆమెమొగం భావశబలితం అయింది.

చూసిచూసి బల్లమీద వుత్తరాలు విసిరికొడుతూ "గంగమ్మవదిన యింత పంతగొట్టుపని చేస్తా రనుకోలేదు నే" నంటూ రుసరుసలాడిం దామె.

"మరి రంగమ్మక్క మాత్రం తక్కువ చేసిందా?"

"సడే, ఈవిడగా రివాళ ముహూర్తం పెట్టుకున్నట్టావిడ కేం తెలుసునండీ పాపం ?"

"ఇది జాలిపడవలసిన సంగతే అయితే, ఆవిడ సంగతి యీవిడకు మాత్రం యేమి తెలుసునూ ?"

ఇది విని ముందు చురుగ్గా చూసి, తరవాత నిదానించి, చివరికి "పోనీ, మన మిప్పుడు చెయ్యవలసిం దేమిటో మీకు తెలుసా ?" అని ఆత్రంగా అడిగిం దామె.

దానిమీద "అదీ మాట" అంటూ బల్లగుద్ది, కుర్చీ కంటుకుపోయినవా డల్లా సరిగా కూచుని "యిక చెప్పు" అంటూ సావధాను డయినా డతను.

"సరే" అందామె అప్రయత్నంగా.

ఏదో ముంచుకువస్తున్నట్టూ, అయినా, అదేమీ గమనించకుండా అతను జాప్యం చేస్తున్నట్టూ కనపడి చిరాకు వచ్చిం దామెకి.

దీంతో మనస్సు చెదిరిపోయి అసలే మరిచిపోయింది.

చివరికి చకితనేత్రాలతో అప్రయత్నంగా గుమ్మంకేసి చూసి, తలుపులు దగ్గిరసానే వుండడం గుర్తించి దిటవు తెచ్చుకుని, అతనికి కొంచెం దగ్గిరగా వెళ్లి, కంఠం కూడా నొక్కుకుని "గంగమ్మ వదినతో నేను వేగలేనండీ" అంది జాలిగా.

"మరి రంగమ్మక్క మాట?"

"చాటున చెప్పకోవాలి. వొట్టి అమాయకురాలావిడ. నేనంటే ప్రాణం యిస్తుంది కూడానూ"

"కనక?"

"మేనరికం నా కిష్టం లేదనుకుంటున్నారేమో మీరు —"

"కనక అన్నాను."

"మా అపేక్ష లెలాంటివో మీ అపేక్షలూ అలాంటివే. మిమ్మల్నీ మిమ్మల్నీ దూరం చెయ్యాలని కాదు —"

"తరవాత యేమిటో చెప్ప మంటున్నా" నన్నాడు కొంచెం నిలవతీసినట్టు జగ్గప్ప.

దానిమీద, ఆమె, ముందు చకిత అయింది. ఒక్క క్షణం అతనికేసి రెప్పవెయ్యకుండా చూసింది. తరవాత, ఆసందుబాట్లో, నిశ్చయానికి వచ్చి, ధైర్యమున్నా పూని, చివరికి "రంగమ్మవదినతో వియ్యం అందడం మీ కభ్యంతరం లేకపోతే, నా కిష్టమే సుమండీ" అంటూ బుంగమూతిపెట్టుకుని, కుర్చీపీట అతనికి మరీ దగ్గిరసా తీసుకూర్చుంది.

ఆమాటలో "మన యిద్దరి చూపూ వొకటే" అన్న దిలాసా కనపడి, బిగపట్టుకున్న శ్వాస ఆడినట్టయి, తేలికపడి "అయితే, మరి, గంగమ్మక్క కేమిటీ చెప్పడం?" అని జిజ్ఞాసతో అడిగా డతను.

అవ్యవధిగా నిరోధించి అడిగినట్టు కాగా దీనికి బదులు చెప్పలేకపోయిం దామె.

"ధోరణి నూడగా, వీలు తప్పితే, రగడ పెంచడానికే వస్తున్నట్టు కనపడుతుందికదా గంగమ్మక్క?" అని మళ్లీ అడిగా డతను.

అందుకూ ఆమె బదులు చెప్పలేకపోయింది.

"పైపెచ్చు, మాఅమ్మ, గంగమ్మక్కనే వూసుకువస్తుంది కదా?" అన్నా డతను, అపాయం తర్జనితో నిర్దేశించి చూపిస్తున్నట్టు.

"అవును సుమండీ" అంటూ కుంగిపోయింది రత్తమ్మ.

అన్నదే కాని, అనాలనీ అనుకోలేదు, అన్నట్టూ యెరగదు.

ఎదురొమ్ముమీది కుంపటిలాగ, వష్టిగడియలూ కలిసివుండకతప్పని అత్తగారు, కత్తులు దూసు కూర్చున్నదనే భ్రాంతి మనస్సు కలిచేసి, హృదయం బద్దలుకొట్టేసి, మెదడు కరిగించేసిం దామెకి.

ఆమె స్థితి గుర్తించి తానూ అలాగే అయిపోయినట్టు మరి మాట్టాడలేకపోయా డతను.

ఏదో వెతుకుతున్నట్టిద్దరి చూపులూ ఆత్రంగా దుముకులాడసాగాయి.

ఈస్థితిలో "నాన్నారోయ్" అంటూ తలుపులు తోసుకుని లోగుమ్మంలో అడుగుపెట్టి, అక్కడ తల్లి కూడా వున్నందున మళ్లీ తలుపులు దగ్గిరసా లాగి, గిరుక్కున మళ్లి చక్కాపోయింది, వారి రెండో పిల్ల అన్నపూర్ణ.

దీంతో వారిద్దరూ మళ్లీ ప్రకృతిలో పడ్డారు.

"అన్నపూర్ణ అయితే, గంగమ్మక్కమంకుతనమూ, ఆవిడకొడుకు బెకూ్క చ-ప్పగా కుదురుస్తుం" దన్నా డతను.

"అసలు, పెళ్లాడితేనా?" అని యెదురడిగిం దామె.

దీనిమీద, వొకరి తరవాత వొకరి కిద్దరికీ చిరునవ్వు వచ్చింది.

మళ్లీ అంతలో గాంభీర్యం తెచ్చుకుని "నా మాట అలా వుంచండి. పెద్దమ్మాయికి అతగాడు సుతరామూ తగడండీ! దాన్ని బతకనివ్వడండీ అతను" అంది రత్తమ్మ.

ఈమాట అన్నప్పుడామెకంఠం గద్గదికమయింది.

మంచుతెర కప్పిన తామరపువ్వురేకల్లాగ ఆమెకళ్లు చెమ్మగిల్లాయి.

ఇది చూసి అతనూ ఆర్ద్రికంతుడయి "గంగమ్మక్క మాత్రం బతకనిస్తుందా దాన్ని?" అన్నాడు జాలిగా.

ఈమాట వినీవినడంతోటే "మీ అమ్మ కడుపు చల్లగా, వున్నమాట అన్నారండీ మీరు. వారి ధోరణి మీకూ తెలుసునండీ! ఇక భయం లేదండీ! నాచిట్టితల్లి కీగండం గడుస్తుందండీ! నా బెంగ తీరిందండీ" అంటూ అతిప్రేమగానూ, అతివాత్సల్యంతోనూ అతని చేతులు గట్టిగా పట్టుకుని ఎగవూపిరి తీసుకుందామె.

దీంతో ముగ్ధుడయినాడతను.

అరమూతలు పడ్డ అతని కళ్లకి, జానకమ్మకీ గంగమ్మ కొడుక్కీ హస్తికీ మశకానికీ వున్నంత అంతరం కనపడింది.

పురోడాశం తీసుకువెళ్లి కుక్కకి పెట్టినట్టున్నా తోచి, స్వగతంగా సీత్కారం కలగ్గా, కనుబొమ్మలు ముడిపడ్డాయి.

వెంటనే వొక నిశ్చయానికి వచ్చి "ఇక చాలు. అంతా నేను చక్కచేస్తాను, బెంగపెట్టుకోకు, నువ్వు వెళ్లు. ఉత్తరాలు మాత్రం మాఅమ్మకోమాటు చూపించు" అంటూ లేచి, బల్లమీది వుత్తరాలు చేతిలో వుంచి, ఆమెని లేవతీశాడతను.

ఆమెకళ్లు ఆనందవిస్ఫారితాలయినాయి.

కాని, ఉత్తరాలు అత్తగారికి చూపించడం మాట వచ్చాటప్పటికి, ఒక వేపునుంచి కార్యసిద్ధి అవుతూ వుండగా, మరోవేపునుంచి కార్యహాని తరుముకువస్తున్నట్టు తోచి, మొదట ఆమె నిర్విణ్ణ అయిపోయింది. అయినా, జగ్గప్పమొగంమీద దృఢదీక్ష గుర్తించి, మనస్సు కుదుటపరుచుకుని, చివరికావుత్తరాలు మరోమాటు చూసుకుంటూ, అడుగులు మెల్లిగా వేసుకుంటూ వెళ్లిపోయిందామె.

ఆమె గుమ్మం దాటేదాకా వుండి "చిన్నమ్మత్త" అని పిలుస్తూ, తరువాత అతను కూడా విసురుగా వెళ్లిపోయాడు.

## ౨

జగ్గప్పా, పురోహితుడూ అరుగుమీద కూచుని జానకిపెళ్లి విషయమే మాట్లాడుకుంటూ వుండగా, మోటారు వచ్చి పోర్టికోలో ఆగింది.

"ఎప్పుడెప్పు"డని యెదురుచూస్తూ లోగుమ్మంలో నుంచుని వున్న ముసలమ్మ, వొక్క అంగలో కారు దగ్గిర వురికి "వచ్చావా అమ్మా?" అంటూ, కారులో వుండగానే గంగమ్మచేతులు పట్టుకుని ప్రేమ గుమ్మరించేసింది.

"మామయ్యతో మరెవరో వున్నారు, ముసుగు సరిచేసుకోవమ్మా" అని గంగమ్మకి మెల్లిగా చెప్పి, ఆమె కొడుకు, స్వయంగానే అవతలి తలుపు తెరుచుకుని, దర్జాగా కారు దిగాడు.

ఈలోపున కంఠం నొక్కుకుని, కళ్లు తిప్పుకుంటూ "రంగి కూడా యివాళే వస్తోందే మించిపోయినట్టూ" అని సాగతీసుకుంది ముసలమ్మ.

కొడుకు చెప్పిన మాటమీద సవరించుకోవాలనుకునిన్నీ, యీమాట విని వులిక్కిపడి, సగం జారిపోయిన ముసుగలాగే వుంచేసుకుని "అదెందుకే యిప్పుడు శనిలాగా?" అని మెల్లిగానే రుంజుకుంటూ, అంతకంటే నింపాదిగా కారు దిగింది గంగమ్మ.

కారు తిరగేసుకుని కొడుకు వచ్చి కలుసుకున్నాక, తల్లి బుజమ్మీద చెయ్యి వేసుకుని, గోటుగా బయలుదేరిందామె.

వారు మెట్లమీద అడుగు పెట్టాటప్పటికి లేచి వచ్చి "వచ్చారా?" అని అక్కనీ, మేనల్లుణ్ణీ పలకరించాడు జగ్గప్ప.

"ఇవాళ బండి అరగంట లేటు" అని గంగమ్మ చెప్పగా, ఆమెకొడుకు చిరునవ్వు నవ్వి వూరుకున్నాడు.

ఇదయాక ముగ్గురూ అరుగెక్కారు.

గంగమ్మా, ముసలమ్మా సింహద్వారందగ్గిరగా నుంచున్నారు.

"ఈవిడ మా పెద్దక్కగారు. ఇతను మేనల్లుడు" అని వారిని పురోహితుడికి పరిచయం చేశాడు జగ్గప్ప.

"చిత్తం చిత్తం, అక్కయ్యగారిని చూసి పదేళ్లయింది. అంతే కాక, అప్పుడే నాకు తమ ఆశ్రయం లభించివుండడంవల్ల కొత్త అయిపోయింది. వాటికి నేడూ మళ్లీ వారి దర్శనం. చాలా సంతోషం" అని వూగిసలాడుతూ బదులు చెప్పాడు పురోహితుడు.

"మొన్నటిదాకా కలకత్తాలో చదివాడు; కాని, ప్రస్తుతం కాశీలో చదువుతున్నాడితను"

మళ్లీ "చిత్తం చిత్తం" అని జగ్గప్పకి వినయం నివేదించుకుంటూనే గంగమ్మకొడుకేకేసి తిరిగి "మీ పేరెవరు నాయనా?" అని అడిగాడు పురోహితుడు.

"రామేష్" అని బదులు చెప్పాడు గంగమ్మ కొడుకు.

అరవై యేళ్ల పురోహితుడికిది తెనుగుజాతిలో వినబడి వుండని పేరు.

ఉలిక్కిపడ్డాడతను.

ఇది గుర్తించి చురచుర చూసి మొగం పక్కకి తిప్పుకున్నాడు జగ్గప్ప.

దాంతో కొంచెం పురెక్కి "యేమిటి నాయనా?" అంటూ చెవు లొరచేసుకుని మళ్లీ అడిగాడు పురోహితుడు.

"రామేష్" అన్నాడు కరుగ్గా గంగమ్మ కొడుకు.

ఈ మాటు కొంచెం పెంకితనం కనపరిచాడతను.

పైగా యీమాటు పేరు చెప్పినప్పుడు షకారం కొంచెం దీర్ఘంగా పలికి, దాంతో చిన్న యీలవంటి సన్నని ధ్వనికూడా పుట్టుకు వచ్చింది.

జగ్గప్ప తనలో నవ్వుకున్నాడు.

రెండుమాట్లు విన్నా ఆపేరేమిటో గుర్తించలేక, గంగమ్మకేసి తెల్లపోయిచూసింది ముసలమ్మ.

"వోట్రి కూపకూర్మాలు" అన్నట్టు మొదట కొడుకేకేసి సగర్వంగా చూసి, తరవాత, తన అలతి నవ్వుతో తల్లి మొగం పులిమింది గంగమ్మ.

"బాగుంది నాయనా" అని రామేష్‌ని అభినందించి, ముసలమ్మకేసి చూస్తూ "తాతగారి పేరు—" అంటూ మాట తేల్చేశాడు పురోహితుడు.

అది పుండుమీద కారపుగుండ కొట్టినట్టయింది ముసలమ్మకి.

దాంతో "మధ్య నువ్వేమిటయ్యోయ్?" అన్నట్టొక చురుకుచూపు పురోహితుడిమీద పారేసి, ముసలమ్మ ధుమధుమలాడుతూ మొగం పక్కకి తిప్పుకుంది.

ఈసందుబాట్లో, రామేష్‌ఉ "ముసుగు సరి చేసుకో" అన్నట్టు తల్లికేసి చురుగ్గా చూడడమూ, కంగారుపడుతూ, ఆమె, ముసుగు ముందుకి లాక్కోడమూ గబగబా జరిగిపోయాయి.

అది కూడా చూసి మెరుపుకొట్టినట్టయి, పురోహితు డొక్క అడుగు వెనక్కి వేశాడు.

"ఇక వీళ్ల నిక్కడ వుండనివ్వడం మంచిది కా" దని వూహించి, జగ్గప్ప, లోపలికి పదమందామనుకుంటూ వుండగా "ఇదిగో వదినగారే? ఎన్నాళ్లకెన్నాళ్లకి? దయచెయ్యండి" అంటూ వూచలాగ వచ్చి, రత్తమ్మ, గంగమ్మచెయ్యి పట్టుకుని లోపలికి తీసుకువెళ్లింది.

"రావోయ్ నాయనా" అని పిలుస్తూ ఆవెనకనే ముసలమ్మ బయలుదేరగా రామేష్‌కూడా లోపలికి వెళ్లిపోయాడు.

చిరునవ్వుతో పురోహితుడేదో అనబోయాడు; కాని "చిన్నక్కయ్యగారు కూడా వస్తున్నారు పెద్ద స్టేషనుకి వెళ్లు" అని అంతకుముందే డ్రయివరుకి ఆజ్ఞాపించి, కూడా రమ్మని పురోహితుణ్ణి కళ్లతో పిలిచి, సన్నజాజిపాదకేసి దారితీశాడు జగ్గప్ప.

"చిత్తం" అని, జగ్గప్ప కొంచెం అవతలికి వెళ్లేదాకా నుంచుని, తరవాత బర్రుమంటూ కారు నడిపించుకుపోయాడు డ్రయివరు.

## 3

రాత్రి భోజనాల దగ్గిర, ముసలమ్మా గంగమ్మా రామేష్‌ఊ వొక పక్కనీ, జగ్గప్పా రత్తమ్మా జానకీ అన్నపూర్ణా, రంగమ్మా ఆమెకొడుకు రామేశమూ వొకపక్కనీ కూచున్నారు.

“ఈయేర్పాటు మాఅమ్మదా?” అని రత్తమ్మని కళ్లతో అడిగి, మొగం వంచుకుని ముసిముసినవ్వులు నవ్వుకున్నాడు జగ్గప్ప.

“మెగపెళ్లివారు కామోసు నాయనోయ్” అన్నట్టు కొడుకేసి చూసి కళ్లల్లోనే నవ్వుకుంది రంగమ్మ.

రామేష్‌ఊ, గంగమ్మా హిందీలో మాట్లాడుకోసాగారు.

అది చూసి “నాతల్లి యెంత తెలివయిందో చూసుకోం” డన్నట్టొకమాటూ, “మీ అల్లు డెంత గొప్పవాడో తెలుసుకున్నారా?” అన్నట్టొకమాటూ జగ్గప్పని విడిచి రత్తమ్మనీ, రత్తమ్మని విడిచి జగ్గప్పనీ సగర్వంగా చూడసాగింది ముసలమ్మ.

ఇది యిలా జరుగుతూ వుండగా, అందరికీ వ్యంజనాలూ అన్నమూ వడ్డించి, రామేష్‌కి మాత్రం గోధుమరొట్టెలూ, బంగాళాదుంపల వేపుడూ పంచదారా వడ్డించింది వంటలక్క.

అందుకే జగ్గప్ప వింతపడుతూవుండగా “ఇప్పణ్ణుంచీ అలవాటు కాకపోతే ముందుముందు కష్టం, జానకమ్మకి కూడా రెండు రొట్టెలు వెయ్యవమ్మా” అని పురమాయించింది ముసలమ్మ.

అది విని యీబంతివా రందరూ యేకకాలంలోనే చకితు లయినారు.

ఎగిరిపడి అన్నపూర్ణ జానకమ్మకేసి చూడగా, జానకమ్మ, ముసలమ్మమీద కోరచూపులు చూసి మొగం వంచుకుంది.

జగ్గప్పా, రత్తమ్మా లోపల్లోపల నవ్వుకున్నారు. రంగమ్మ వారి యింగితం కనిపెట్టసాగింది.

ఒక్క నిమిషం గంభీరంగా వెళ్లిపోయింది.

ముందొకమాటు రామేశంకేసి కొంటెచూపు చూసి, కంఠం కూడా సవరించుకుని, తరవాత రామేష్‌ని సంబోధించి మెల్లిగా ప్రారంభించాడు జగ్గప్ప.

“నీకు రొట్టెల అలవా టెప్పణ్ణుంచోయ్?”

“కలకత్తా వెళ్లినప్పణ్ణుంచీనీ”

“ఎందు కయిందీ?”

“దాని కది కాలేదు, కోరి నేనే చేసుకున్నాను”

“ఎందుకోసం?”

“వెధవది వరిఅన్నంలో యేముంది మామయ్యా?”

“ఇవాళ కొత్తటోయ్ మనకీ?”

“పాత అయితే మాత్రం తెలిశాక కూడా తప్పు చెయ్యమా?”

“ఇది తప్పే అంటావా?”

“ఇంకా సందేహమా?”

“ఎంచేతా?”

“ఉత్తరదేశంలో యెవరూ వరిఅన్నం తినరు కనక”

“అయితే?”

“అది వొట్టి తుక్కు. పశువుల కేనా పనికిరాదు”

రంగమ్మ గంగమ్మవిస్తరికేసి చూసింది.

అది యీ పెతో పొడిచినట్టు కాగా, గంగమ్మ అందుకుని “నాయన చెప్పినప్పణ్ణుంచీ నేనూ గోధుమరొట్టెలే తింటున్నాను; కాని మీరు దేవుళ్లాడతారని యిప్పుడు మాత్రం వరిఅన్నం తింటున్నా”నని రత్తమ్మకి చెప్పి, రంగమ్మకేసి యెర్రగా చూసి, కొడుకేసి విజయగర్వంతో చూసింది.

అందరూ వొక్కమాటామెని చూసి చల్లగా వూరుకున్నారు.

ఉండుండి “ఉత్తరదేశంవాళ్లకీ మనకీ యేమి సాపత్యమోయ్ దీల్లోనూ?” అని మళ్లీ అడిగాడు జగ్గప్ప.

“సాపత్యం లేకపోబట్టే మనం యిలా వున్నాము”

“వాళ్ల విశేషం యేమిటి?”

"వాళ్లే నికరమైన హిందువులు. మనంకూడా గోధుమరొట్టెలు తింటేనే నికరమైన హిందువులం అనిపించుకుంటాం"

"అక్కడ ముస్లిములుకూడా గోధుమరొట్టెలే తింటారు కామోసు మరి ?"

ఇలా అడిగి రామేశంకేసి చూస్తూ కళ్లు చికిలించుకున్నాడు జగ్గప్ప; కాని యిందులో వున్న విశేషం గుర్తించలేక—అసలు, విశేషం యేమయినా వుందేమో అనయినా ఆలోచించకుండా "అవును, తింటారు" అనేసి వూరుకున్నాడు రామేష్‌ఉ.

రామేశం మేనమామకేసి చూసి మందహాసం చేశాడు.

ఇంతలో వడ్డన పూర్తి కాగా, భోజనాలారంభమైనాయి.

మామూలుగా అందరికీ వడ్డించి, రామేష్‌కి నెయ్యి వెయ్యాలో అక్ఖర్లేదో, వేస్తే యెక్కడ వెయ్యాలో తెలవక అతని దగ్గిర నిలిచిపోయింది వంటలక్క.

ఆమె అలా నిలిచివుండిపోవడం విడ్డూరంగా కనపడి ప్రాన్పడి అందరూ అటే చూశారు.

రామేష్ కూడా చూసిచూసి "అక్ఖర్లే" దన్నాడు.

ఇది విని యివతలి బంతివారందరూ గతుక్కుమనిపోయారు.

అంతటితో వూరుకోలేక వెంటనే అందుకుని "ఉత్తరదేశంవాళ్లకి నెయ్యికూడా పశువులకేనా పనికిరాని వొట్టి తుక్కేనా యేమిటోయ్ ?" అని అడిగింది రత్తమ్మ.

ఇది విని రంగమ్మా, రామేశమూ సోత్సాహులై మొగమొగాలు చూసుకున్నారు.

నెయ్యి లేకుండా భోజనం చెయ్యడం ముసలమ్మకి కూడా ఆగాయిత్యంగానే కనపడింది. దాంతో "వేయించుకో నాయనా" అన్నమాట నాలుకచివరికి కూడా తెచ్చుకుంది; కాని యేమంటే యేమిటో అని సాహసించలేక గంగమ్మకేసి మిడుతూ మిడుతూ చూసింది.

అది అన్నపూర్ణకి లోకువిచ్చింది.

వెంటనే ఆమె అందుకుని "రొట్టెలు తినడం అలవాటు చేసుకోమన్నట్టే, నెయ్యిలేకుండా భోజనం చెయ్యడం కూడా అలవాటు చేసుకో మంటావా యేమిటి నాన్నమ్మా అక్కయ్యనీ ?" అంటూ సాగతీసుకుంది.

దీనిమీద పకాలు మని నవ్వు రాగా అతికష్టం మీద ఆపుకోడంలో రంగమ్మకి బాగా కొలకమారింది.

జగ్గప్ప మూతి బిడాయించుకుని నవ్వాపుకోగా, రామేశం, దగ్గులో కలిపి నవ్వుకున్నాడు.

"మహా బాగా అడిగా" వన్నట్టు తల సుతారంగా పంకించుకుంటూ చిన్నకూతుర్ని మెప్పుగా చూసింది రత్తమ్మ.

మొదట "యేదో పోనిస్తూ" అన్నట్టూరుకున్నాడు; కాని, రామేష్‌ఉ, చివరికి కొంచెం వుడికిపోయినట్టయి తల్లితో హిందీలో యేదో అన్నాడు.

ఇదంతా గంగమ్మకి వుక్రోషం కలిగించింది.

ఊరికే — చుట్టపుచూపుగా మాత్రమే వచ్చివుంటే, ఆమె కూడా, హిందీలో యెంతెంత మాటలేనా అనేసివుండును; కాని, సమయం కాక పస్తాయించవలసివచ్చింది.

అప్పటికే "మాడు ముళ్లూ పడనియ్యి జవాబు చెబుతాడు నీ" కన్నట్టు రత్తమ్మకేసి వోరగా కోర చూపులు చూసింది.

అంతటితో తృప్తిపడక, చివరికి "నా నాయనకి తెలిసినట్టైవరికి తెలుసూ? అతనికి వంకలు పట్టాలంటే యెంతవాళ్లు కావాలీ?" అంటూ కళ్లు తిప్పుకుని, ముసుగు మరింత ముందుకి లాక్కుంది.

దీంతో పరిసరాలు కొంచెం కలుషితా లయినట్టు కనపడ్డాయి.

ఈసంభాషణకి అతీతురాలై వున్న వంటలక్క అది పసికట్టింది.

రసభంగం కావచ్చు నని శంకించి, వెంటనే ఆమె "చింతకాయపచ్చడి, చింతకాయపచ్చడి" అంటూ యెవరికీ వడ్డించకుండానే బంతి అంతా గిర్రున తిరిగేసి తుర్రుమని వంటింటోకి చక్కాపోయింది.

ఇది సరిగా పనిచేసింది.

మంత్రించినట్టు అందరిమొగాలూ విడ్డాయి.

ముఖ్యంగా, రోమేష్ మనస్సు కొంచెం పురకలు వేసింది.

వెంటనే, బదులు తీర్చుకోవా లని వుబలాట పడి, అతను "చింతకాయపచ్చడికీ నువ్వులనూనెకీ జత కదా, మరి నువ్వు నెయ్యి వేయించుకున్నావేం?" అని అన్నపూర్ణమీద పరిహాచకం విసిరాడు.

"అయితే, నువ్వు చింతకాయపచ్చడి అయినా వేయించుకున్నావు కావేం ?" అని అన్నపూర్ణ బదులు తీర్చింది.

"దొరికిపోయావు" అన్నట్టు అవ్యవధానంగా అందుకుని "పచ్చడి పచ్చడి అంటూ రాచ్చిప్ప చూపించడమే కాని వడ్డించడం యేదే?" అని గంగమ్మ ముదలకించింది.

దీనిమీద ముసలమ్మ విజయగర్వం చూపించుకోగా, రంగమ్మ "మొగపెళ్లివారికి వచ్చిన పాట్లవి" అన్నట్టు కొడుక్కేసి చూస్తూ అలవోకగా చిరునవ్వు నవ్వుకుంది.

ఇలాగ, మొత్తానికి, పరిసరాలు మళ్లీ మామూలు స్థితికి వచ్చాయి.

"అయితేనూ?" అంటూ మళ్లీ వెంటనే అందుకున్నాడు జగ్గప్ప.

"రోమేష్ అన్నా వేమిటోయ్ నీ పేరు?"

"అవును మామయ్యా!"

"ఏం, రామేశం అన్నపేరు పనికివచ్చింది కాదూ?"

"అందులో అర్థం లేదు మామయ్యా, రాముడికి యీశ్వరు డేమిటి-తెలివితక్కువ కాకపోతేనూ?"

"వ్యుత్పత్తి అంతా పెల్లగించేశావే?" అన్నట్టు రోమేష్‌కేసి చూశాడు రామేశం.

"మరి రోమేష్ అంటే యేమిటే?" అని అడిగాడు జగ్గప్ప.

"లక్ష్మీదేవికి భర్త అన్నమాట" అని హైస్కూలు తెనుగుపండితుడి దర్జాతో అర్థం చెప్పాడు రోమేష్.

"అమ్మయ్యా" అన్నట్టు చూసింది, జానకి, అన్నపూర్ణకేసి.

విశాఖపట్నంలో తహసీలుదారుగా వున్న జగ్గప్ప తమ్ముడి కూతురిపేరు లక్ష్మీదేవి. ఆమె యూనివర్సిటీ కాలేజీలో రెండో సంవత్సరం చదువుతూ వుండడమూ, తండ్రి; ఆమెని రోమేష్ కివ్వా లని ప్రయత్నిస్తూ వుండడమూ, కోడలు నలుపయితే కులం అంతా నలుపవుతుం దన్న భయాన గంగమ్మ తిరస్కరిస్తూ వుండడమూ—అదంతా మరోచిన్నకథ.

జానకీ, అన్నపూర్ణా ఆగొడవలో వుండగా "యే భాష అదీ?" అని అడిగాడు జగ్గప్ప.

"సంస్కృతం" అన్నాడు రోమేష్.

జగ్గప్ప ప్రకాశంగానూ, రామేశం స్వగతంగానూ "ఆ" అని వొక్కమాటే చకితులై, అపవారించి, వొకరికేసి వొకరు చూసుకొని వొక్కమాటే మందహాసం చేసుకున్నారు.

"రోమా—ఈష్‌ఊనా" అని తాపీగా అడిగాడు జగ్గప్ప.

"అవును"

"రోమా అంటే ?"

"లక్ష్మి అన్నమాట. ఈష్ అన్నది యీశ శబ్దవికృతి"

"రమా రోమా ?"

"ఉత్తరదేశంలో రాతలో 'రమా' అనే వుంటుంది; కాని 'రోమా' అని పలకాలి"

"ఉన్నది వున్నట్టే పలికితే యేం ? "

"పనికిరాదు. అది సంస్కృతభాషాసంప్రదాయం. మనవాళ్లకి హ్రస్వాకారం యెలా పలకాలో తెలవదు"

"అయ్యో"

"అయ్యో అంటే! ఈ విషయంలో, మనలో మహామహా వ్యాకరణ పండితుల మనుకునేవాళ్లు కూడా ఉత్తర దేశపు హీనజాతుల పాటయినా యెరగరు"

"బాగుంది...అయితే, అ ఆలు ఎలా పలకాలంటావోయ్ ?"

"ఒ ఆ అని"

చకితుడై, రామేశంకేసి చూసి అలవోకగా మందహాసం చేశాడు జగ్గప్ప.

రామేశం వింతగా చూశాడు రొమేష్‌కేసి.

కాని, యీ రెండూ పూర్తి కాకుండానే అందుకుని "మరి అంత తెలిసినవాడు కదా, "ఒ ఆ అని" అంటా డేమిటి బావ, నాన్నారూ! "ఒ ఆ" ఒని ఒనాలి కాదండీ" ఒని ఒడిగింది ఒన్నపూర్ణ.

హాలంతా పకపకలతో నిండిపోయింది.

ఒక్క క్షణం వూరుకుని "అయితే మాత్రం, రొమేష్ అనడం యెందుకూ, రామేశం అనవచ్చునే?" అని అడిగాడు జగ్గప్ప.

"కోళం పాళం లేళం అన్నట్టు యీళం యేమిటి మామయ్యా" అని కొంచెం వెటకారంగా బదులడిగాడు రొమేష్.

"ఎంత గొప్ప ప్రశ్న వేశాడో నాయన చూసుకో" అన్నట్టు సగర్వంగా చూసింది గంగమ్మ ముసలమ్మకేసి.

అది చూసి "హూష్" అంది అన్నపూర్ణ వంటింటికేసి చూస్తూ, పిల్లివచ్చినట్టూ దాన్ని గదుముతున్నట్టూనూ.

ఉలిక్కిపడి చూసి, రత్తమ్మా రంగమ్మా చిరునవ్వు నవ్వుకుంటూ మొగాలు వంచుకున్నారు.

అన్నపూర్ణసమయజ్ఞతకి మెచ్చుకున్నాడు; గాని, అంతటితో జగ్గప్పకి తృప్తి కాలేదు.

"అయితే, మ వీవ్వ తెనుగు పాళా లన్నీ విడిపించుకో తలుచుకున్నా వన్నమాటా?" అని కొంచెం నిష్ఠురంగా అడిగా డతను రొమేష్‌ని.

"అదీ మాట" అనుకున్నాడు, మొగం వంచుకుని, రామేశం.

ఈ మాటతో రొమేష్‌కి చిరాకు కలిగింది.

పైగా, రొమ్ము విరుచుకుంటూ, అందుకోసం వంచుకున్న మొగం పైకెత్తుకోకుండానే "అన్నమాటే" అనేశాడు, నిర్లక్ష్యంగా అతను.

దీంతో రత్తమ్మకీ, జగ్గప్పకీ హృదయాలు నిండిపోయాయి; కాని కడుపులు నిండక, కొంతసేపు ఏకాగ్రచిత్తంతో భోజనం చేశారు.

జానకమ్మ, వికారం వస్తున్నట్టు బాధపడుతూ, కళ్లు మూసుకునీ మొగం పైకెత్తుకునీ గోడకి చేరబడిపోయింది.

ఇదంతా పరిశీలిస్తూ వున్న రంగమ్మ, కొడుకు ప్రశ్నార్థకదృష్టులతో తన ఆశాదృక్కులు మిళితం చేసింది.

ఈ సమయాన చారు తెచ్చి, అందరికీ అన్నంలోనూ, కొందరికి గిన్నెల్లో కూడానూ వడ్డించి "అక్ఖర్లే" దని రొమేష్ ఉ చిన్న మురములాంటి గదుము గదమగా బేజా రయిపోయి, యెగిరి వంటింటిలో పడింది వంటలక్క.

"చూశారా?" అన్నట్టు రత్తమ్మ చూడగా "వూరుకో" అన్నట్టు బదులు చూసి "చాలా బాగుంది, చారు పుచ్చుకోవోయీ" అని రొమేష్‌ని ప్రోత్సహించాడు జగ్గప్ప.

"చారు పుచ్చుకుంటే పైత్యం విరిగిపోతుంది, పుచ్చుకో నాయనా" అని ముసలమ్మకూడా చెప్పింది.

కాని, రొమేష్‌ఉ అందు కంగీకరించ లేదు.

అంతటితో. వూరుకోక మొదట ధుమధుమలాడాడు. తరవాత "వెధవ చింతపండు దేశం. దరిద్రం" అంటూ చెండుకున్నాడు.

నిర్విణ్ణుడై "అదేమి?" టన్నాడు జగ్గప్ప.

"ఈచింతపండు వాడకంవల్ల, ఉత్తర దేశంవాళ్లు మనవాళ్లని పురుగులకింద కట్టేశారు మామయ్యా"

"ఎంచేతో?"

"రక్తం విరిచేస్తుంది చింతపండు"

"మరి, వాళ్ల గుడగుడముద్దా, థంగూ మంచివా?"

"దీనికేం చెబుతా?" వన్నట్టు వోరచూపులు చూశాడు రామేశం.

కాని, భోజనంతొందర నటిస్తూ జవాబు చెప్పడం మానేశాడు రామేష్.

అయినా, వూరుకోక జగ్గప్ప రెట్టించి అడిగాడు.

"వాటిలో నాకు తప్పు కనపడలేదు మామయ్యా! పైగా, అవి వైభవానికీ భోగాలకూ గొప్ప గుర్తులని కూడా చెప్పవచ్చు. ఎంచేతనంటే వాటిలో చాలా విలవయిన వస్తువులు పడతాయి"

"నీకూ వాటి అలవాటయిందా?"

ఇది విని జానకి చకిత అయి మొగం వంచుకోగా, అన్నపూర్ణ, తానూ ఆమాట నిక్కచ్చిగా అడుగుతున్నట్టు చూసింది.

"దొరికిపోయాడు" అన్నట్టు తల్లికేసి చూస్తూ రామేశం చిరుదగ్గు నటించాడు.

కొంపతీసి "అయిం"దనేస్తాడేమో అని గంగమ్మ కొడుక్కేసి బిక్కుబిక్కు చూసింది.

ముసలమ్మకూడా ఆదుర్దాపడిపోయింది.

అప్పటికి నెమరు తిరిగి "అక్కడి శీతోష్ణస్థితికవి అవసరం మామయ్యా" అన్నాడు చివరికి రామేష్.

"అలాగే యిక్కడి శీతోష్ణస్థితికి చింతపండు అవసరమేమో?"

ఇలా అడిగి మేనమామ తనకేసి నిలవతీస్తున్నట్టు చూడగా, బుర్ర వంచుకుని, రామేషు, భోజనం తొందర నటించాడు.

రామేష్ లాగ కాక, జగ్గప్ప, నిజంగానే భోజనంతొందర అనుభవించాడు.

ఒక్కక్షణం నిశ్చలంగా భోజనమున్నా చేశాడు.

తరవాత మళ్లీ మెల్లిగా అందుకున్నాడతను.

"అక్కడివాళ్లు ఆనపాకులూ, గుమ్మడాకులూ పులుసులో వేసుకుంటారు కాదుటోయ్?"

"ఆ, వేసుకుంటా, రేం వేసుకుంటే?"

"అబ్బే నాకేం, ఆరుచి నీకూ అలవాటయిందా?"

జవాబు చెప్పలేక రొట్టెముక్క కొంచెం పెద్దదిగా విరిచి నోట పెట్టుకున్నాడు రామేష్.

"అక్కడి బ్రాహ్మలు చేపలు తింటారు కాదూ?"

ఈమాట తల్లికేసి చూస్తూ అడిగాడు జగ్గప్ప.

"అవును, తింటారు. శాస్త్రంలో తినవచ్చనే—కాదు, తినమనే వుంది. మనవాళ్లు ఉల్లిపాయలు తింటారు. అది శాస్త్రనిషిద్ధం"

కొడుకిలా చెప్పగా, గంగమ్మ "ఏం, తీరిపోయిందా?" అన్నట్టు తల పంకిస్తూ జగ్గప్పకేసి చూసింది.

దానిమీద, అది చూడనట్టు నటిస్తూ జగ్గప్ప, గంగమ్మకేసి చూస్తూ "అయితే, ఆవిషయంలో నువ్వు కూడా — అక్కడివాళ్లతో పాటు — శాస్త్రసమ్మతంగానే—" అని తల వూపుకుంటూ చూపులతోటే మాట పూర్తిచేశాడు.

ఇది విని జానకి వెలపరించుకుంది.

కళ్లు మూసుకుని మొదట జలదరించుకుని, తరవాత రామేష్‌కేసి చురుకూ చురుకూ చూసింది అన్నపూర్ణ.

రంగమ్మా, రామేశమూ అపవారించి ముక్కులు బిడాయించుకున్నారు.

"ఏం, మనమడి వరస బాగుందా?" అన్నట్టు ముసలమ్మకేసి చూస్తూ తల అడ్డంగా వూపుకుంది రత్తమ్మ.

తల్లి యింగితం గుర్తించి జవాబు చెప్పడం మానేసి, కుడిచేత్తోటే గళాసు అందుకుని మంచినీళ్లు పుచ్చుకోడం తొందర నటించాడు రామేష్.

ఇది జగ్గప్పకి మరీ అపస్మారంగా కనపడింది.

చకితుడై రామేశం తనకేసి చూడ్డంవల్ల అతను కొంచెం వుద్రిక్తుడున్నూ అయినాడు; కాని సమాళించుకొని వెర్రిగానే అందుకుని "భోజనం చేశాటప్పుడు కూడా వుత్తర దేశంవాళ్లు కుడిచేత్తోటే మంచినీళ్లు పుచ్చుకుంటారా యేమిటోయ్?" అని అడిగాడు రొమేష్‌ని.

"అవును, పుచ్చుకుంటారు. అక్కడివాళ్లు యెప్పుడూ—యేదీ కూడా యెడమచేత నోట వుంచుకోరు"

"కొళాయినుంచో, యేటినుంచో, నూతిలోనుంచో మంచినీళ్లు పట్టుకునేటప్పుడూ, రొట్టెలు చేశాటప్పుడూ కూడా యెడమచెయ్యి తగలనివ్వరు కామోసునేం వాళ్లు?"

రొమేష్‌ఉ మొగం వంచుకుని వూరుకున్నాడు.

రంగమ్మా, రామేశమూ భోజనంఅడావుడిలో యిది గమనించనట్టే నటించారు; గాని వాళ్ల యెదట యిలాంటి సంభాషణ వచ్చినందుకు గంగమ్మ చాలా యిదయిపోయింది.

అది ములుకు నాటినట్టు కాగా, ముసలమ్మ "అదేమిట్రా అలాంటి వికటప్రశ్నలు వేస్తావూ?" అని నిష్ఠురంగా అడిగింది జగ్గప్పని.

దానిమీద "లేదమ్మా లేదు. ఏదో కులాసాగా —మనం ముక్కూ మొగమూ యెరగని దేశం కాదూ అదీ? అంచేత ప్రజల వైభవాలు తెలుసుకుని ఆనందిద్దామని—పోనీ, యిక అడగను లే" అని సద్దిచెబుతూ మొగం వంచుకున్నాడు జగ్గప్ప.

కాని, అవ్యవధానంగా అందుకుని, అన్నపూర్ణ "పాపం, చూడనివాడు బా వేం చెప్ప గలడు, నేను చెబుతాను వినండీ నాన్నారూ! మరేం? మొదట, యిద్దరాడాళ్లు యెదురెదురుగా కూచుంటారండీ! ఇంటో రెండో ఆడది లేకపోతే, మొగుడూ పెళ్లాలే అలా కూచుంటారండీ! ఊతం కోసం యిద్దరూ యెడమచేతులు కింద ఆనుకుని, కుడిచేతులతో పిండిపిసికి ముద్దలు చేస్తారండీ! తర వాతా? ఆ ముద్దను వొకళ్ల చెంపమీద వొకళ్లుంచి, బాగా అయిదువేళ్ల ఆనవాళ్లూ అంటేదాకా ఫెడీ ఫెడీ చరుచుకుంటారండీ!" అని తండ్రితో చెప్పి "కదూ నాన్నమ్మా?" అని ముసలమ్మని బెల్లించింది.

ఈ బంతిలోవాళ్లందరూ విరగబడి నవ్వుకున్నారు.

గంగమ్మ విముపునవ్వు నవ్వింది.

రొమేష్‌ఉ చాలలేని నవ్వు నవ్వాడు.

"నువ్వు మాసొచ్చావు లంజికానా" అంటూ ముసలమ్మ మొగం ముడుచుకుని, ఉప్పుపిండీ వంకాయ పులుసుపచ్చడీ గబగబా కలిపేసింది.

ఒక్క నిమిషం నిశ్చలంగా వెళ్లిపోయింది.

పరమాన్నం తెచ్చి అందరికీ గిన్నెల్లో వడ్డించింది వంటలక్క.

మళ్లీ మళ్లీ వేయించుకుని అందరూ ఆప్యాయనంగా పుచ్చుకున్నారు; కాని, రొమేష్‌ఉ, కాస్త కాస్త చొప్పున రెండుమాట్లు మాత్రం చప్పరించి, గిన్నె దూరంగా పెట్టేశాడు.

అది అతనికి సయించలేదని గ్రహించి, గంగమ్మ, మరో గిన్నెతో పాలు తెప్పించి పుచ్చుకోమంది.

హిందీలోనే పుచ్చుకోమంది.

దాంతో యెక్కడ లేని రుచీ పుట్టుకువచ్చింది రొమేష్‌కి.

వెంటనే, ఆగిన్నె కూడా కుడిచేత్తోటే అందుకుని, మధ్యమధ్య వూదుకుంటూ నిశ్శేషంగా పుచ్చుకుని, హిందీవూతపదంతో గర్రున తేన్చి, తన భోజనం అయిపోయినట్టు వెనకపీటకి చేరబడ్డాడతను.

భోజనం అయిపోయాక వూరికే కూచోడం దర్జాప భంగకరం అని వూహించి, గంగమ్మ, "లేచి వెళ్లు నాయనా" అని హిందీలో చెప్పింది.

అదేమిటో యెరక్కపోయినా, జగ్గప్ప, రొమేష్‌యింగితం గుర్తించి "నీభోజనం అయిపోయిన

ట్టుంది, వూరికే కూచోడం యెందుకు, లేవోయ్" అన్నాడు.

ఆమాట రావడమే తడువుగా వెండికంచంలోనే చెయ్యి కడిగేసుకుని, కట్టుకున్న లుంగీ ఆకంచానికి రాసుకునేటట్టు బయలుదేరి, జేబులో చెయ్యిపెట్టి అగ్గిపెట్టే బీడీ తీసుకుంటూనే చక్కాపోయాడు రొమేష్.

౪

తాంబూలచర్వణం చేసుకుంటూ జగ్గప్ప హాల్లోకి వచ్చాటప్పటికి, అతి టెక్కుగా పచారు చేస్తూ, గుప్పుగుప్పున బీడీపొగ విడుస్తూ, అతిదర్జాగా రామేశాన్నేమిటేమిటో అడుగుతూ, తన ఆధిక్యం కనపరుచుకుంటున్నాడు రొమేష్.

సోఫాలో కూచుని వార్తాపత్రిక చదువుకుంటూ, ఆదర్జాను మించిన నిర్లక్ష్యంతో వుండుండి సగంసగం మాటలతో జవాబులు చెబుతూ, తన నిరసన భావం కనపరుస్తున్నాడు రామేశం.

మేనమామని చూడగానే, రామేశం, పత్రిక మేజామీద పడేసి నిటార్గా కూచున్నాడు; కాని, రొమేష్ మాత్రం బీడీ కాల్చడమూ మానలేదు. టెక్కూ తగ్గించుకోలేదు.

వెళ్లివెళ్లి జగ్గప్ప రామేశందగ్గిర కూచున్నాడు.

మెరుపుదీపాల గుబురులో గూడు కట్టుకుంటున్న పొట్టిపిచిక, కిచకిచలాడుతూ రెక్కలాడించి, వొక గడ్డిపోచ రొమేష్‌నెత్తిమీద రాల్చింది.

"ఈసంవత్సరం ఫైలు ఏమాత్రమోయ్?" అని అడిగాడు జగ్గప్ప రామేశాన్ని.

"నిరటికంటే యెక్కువే రావచ్చు మామయ్యా"

"నిరుడు?"

"నామట్టుకి పద్ధెనిమిది వందలు"

"క్లో సెయ్" అనుకున్నాడు రొమేష్.

హిందీలోనే అనుకున్నాడు.

"కొత్తకేసుల్లో పెద్దఫీజువి—"మాట సగంలో ఆపి, జగ్గప్ప ప్రశ్నార్థకంగా చూడగా "రెండున్నాయి మామయ్యా! ఒకటి రెండువందలదీ, మరోటి మూడువందల పాతికదీనీల" అని బదులుచెప్పాడు రామేశం.

"బాగుంది"

"ఒక్క తమాషా మాత్రం వుంది మామయ్యా"

"ఏమిటోయ్?"

"ఆ కేసులో మానాన్నగారూ, మాబావా అటూ, నేనిటూనూ"

"భేష్! తండ్రినే యెదిరిస్తున్నావన్నమాట"

రామేశం ముసిముసినవ్వులు నవ్వుకున్నాడు.

"మీనాన్న కేమాత్రం ఫీజు?"

"అయిదువందల యాభై"

వీ రిలా మాట్లాడుకుంటూ వుండగా ముసలమ్మ మెల్లిగా వచ్చింది.

జగ్గప్పా, రామేశమూ లేచి నుంచున్నారు.

ముసలమ్మ వెనక్కి తిరిగి చూడగా, అదెందుకో అని జగ్గప్పకూడా చూడగా, రొమేష్‌ఉ గట్టిగా పొగపీల్చి మెరుపుదీపంమీదికి వూత్తున్నాడు.

మొగం పక్కకి తిప్పుకుని రామేశం చిరునవ్వు నవ్వుకోగా, జగ్గప్ప, తానది చూడనట్టు నటిస్తూ "రామానికి నిరుడు రెండువేలు కిట్టాయిటమ్మా" అన్నాడు.

ఇది విని ముసలమ్మ తప్పకుండా ఆనందిస్తుందనుకున్నాడు జగ్గప్ప.

అభిమానం అటే వుండినా, మాటమట్టుకేనా "సంతోషం" అంటుందనుకున్నాడు రామేశం.

కాని, ముసలమ్మ, చురచుర చూస్తూ "నువ్వోమాటు కిందికి వెళ్లరా" అని రామేశాన్ని ఆజ్ఞాపించింది.

"అయింది గర్వభంగం అబ్బాయికి" అనుకుని రొమేష్ ఉ మరోబీడీ ముట్టించాడు.

జగ్గప్ప తెల్లబోయాడు; కాని, రామేశం, ఏమీ జరగనట్టే నిశ్చలంగా కిందికి దిగిపోయాడు.

వెంటనే యెదటి సోఫాలో చతికిలబడి "గంగమ్మ కొడుక్కి భూములమీదే రెండువేలు వచ్చిపడతాయి కాళ్లదగ్గిర" అంది ముసలమ్మ.

"అతని కేమమ్మా బంగారుపిచిక" అన్నాడు జగ్గప్ప.

"అతగాడికి నెలకి రెండుమూడు వేలదాకా జీతం వచ్చే వుద్యోగమే అయిపోతుందిట. మొదలే అయిదువంద లిస్తారుట"

"కావాలి. చాలా సంతోషం"

"ఎంత లేదన్నా సంవత్సరానికి యిరవై వేలయినా నిలవచేయిస్తుంది తల్లి"

"గంగమ్మకక్క పొదుపు నే నెరగనూ?"

"మరి నీతో మాట్లాడా లంటోంది అది"

"అభ్యంతరం యేమీ, వెడదాం పద" ఇలా అంటూ గభీ మని లేచి "ఇక్కడే మాట్లాడుతుంది" అని ముసలమ్మ చెప్పగా, మళ్లీ కూచున్నాడు జగ్గప్ప.

వెంటనే "మీ అమ్మ నిక్కడికి పంపవోయ్ నాయనా" అని ముసలమ్మ చెప్పడమూ, మడమలు తాటించుకుంటూ రామేష్ కిందికి వెళ్లిపోవడమూ, ముసుగు సవరించుకుంటూ గంగమ్మ రావడమూ వరాసగా జరిగిపోయాయి.

"కూచోవమ్మా" అన్నాడు జగ్గప్ప.

చెయ్యిపట్టుకుని తనపక్కని కూచోపెట్టుకుందామెని ముసలమ్మ.

అతిదర్జాగా చిరునవ్వు మొలిపించుకుని మెల్లిగా అందుకుంది గంగమ్మ.

"నన్నూ, అబ్బాయినీ మీబావ పంపించారు తమ్ముడూ"

"సంతోషమే. అయితే చాలా పెద్దపనే అన్నమాట"

"అవతల బావా వేలు గడిస్తున్నాడు, యివతల నువ్వూ వందలు గడిస్తున్నావు, మీయిద్దరికీ వుండే పని పెద్దది కాకపోతే చిన్న దెలా అవుతుందిరా!" అంది ముసలమ్మ.

"నీఆశీర్వచనం" అన్నాడు జగ్గప్ప, చేతులు దోయిలించుకుని.

"అబ్బాయికి సంబంధాలమీద సంబంధాలు వచ్చిపోతున్నాయి తమ్ముడూ" అంది గంగమ్మ.

"ఆశ్చర్యం యేమిటమ్మా?"

"పెట్టిపుడితే గాని జమీందార్లకి దొరుకుతాడా నీకొడుకువంటి పెళ్లికొడుకు?" అంటూ గంగమ్మవీపు నిమిరింది ముసలమ్మ.

"నాలుగు వేల దాకా కట్నమూ, అయిదారు వందల దాకా లాంఛనాలూ పలుకుతున్నా యోయ్"

"పలక్క? అమ్మ చెప్పినట్టు మీకేం తక్కువమ్మా?"

గంగమ్మముగాన గర్వరేఖ మెరిసింది. మహారాణీ తల్లి లాగ, ముసలమ్మ, దర్జాగా సోఫాకి చేరబడింది.

చూసి చూసి "అవేమీ నాకిష్టం లే"దంది గంగమ్మ.

"అదేమీ?" అన్నాడు జగ్గప్ప ఆశ్చర్యం కనపరుస్తూనూ.

దీనిమీద ముసలమ్మ అందుకుని "అదేమిట్రా నాయనా, అలా అంటావూ? ఇక్కడ జానకి వుండగా, అక్కడ మరోపిల్ల నెలా చేసుకుంటుందితా అక్కయ్య?" అని సాగతీసుకుంది.

"అదా? అయితే, మరీ సంతోషం" అంటూ గంగమ్మకేసి చూశాడు జగ్గప్ప.

"తథాస్తూ అనిపించుకుందా మనీ, ముహూర్తం కూడా స్థిరపరిపించుకు మరీ వెడదా మనీ వచ్చాను నేను"

"ఓ! నీ కా అధికారం లేకపోలేదు"

దీనికి తానూ చాలా ఆనందించి "యిక నువ్వూరుకో" అన్నట్టు గంగమ్మని జనాంతికంగా గిల్లి, కంఠం సవరించుకుని "నాయనా" అంటూ అందుకుంది ముసలమ్మ.

"నువ్వు లోటు చేస్తా వని కాదు కాని, నీనోటి మాట విందా మని నావుబలాటం"

"నీక డ్డేమి టమ్మా?"

"లోకం హర్షించాలి. అక్కయ్య స్వతంత్రిస్తూ వున్నందుకు బావ కూడా 'వోహో' అనాలి"

"మరి, తనని బావే పంపా డంది అక్కయ్య?" అని కనుబొమ్మ లెగరవేసుకుంటూ అడిగాడు జగ్గప్ప.

గంగమ్మ కంగారుపడి "అదేమిటే అలా అందు కున్నావూ?" అన్నట్టు తనకేసి ఆత్రంగా చూడగా "అది కాదు నే నన్నది" అంటూ ముసలమ్మ మళ్లీ అందుకుంది.

"ఇక్కడికి రావడానికి కాదు అక్కయ్య స్వతంత్రిస్త, కట్నం సంగతీ, లాంఛనాల విషయమూ తన యిష్టం వచ్చినట్టు పరిష్కారం చేసుకోడానికి"

"అక్కయ్య కెప్పుడూ వుంది స్వతంత్రం, యివాళ కొత్తా, అది నేనెరగనిదా?"

ఈమాటలో తన గొప్పతనమే గుర్తించుకుంది గంగమ్మ.

"కనక — చెప్పాను కాదూ, నీనోట విందా మని—"

అర్థోక్తిలో అందుకుని "నేను డబ్బే పావనం అనుకుంటున్నా ననుకోకు. అవతల తరుముకు వస్తున్న వాళ్లు పెదవి విరవకుండా వుండాలి, సహాధ్యాయులు అబ్బాయిని తీసికట్టుగా చూడకుండా వుండాలి, అంతే నా ముచ్చట" అంది గంగమ్మ.

పక్కకి చూస్తూ వూరుకున్నాడు జగ్గప్ప.

ఒక్క క్షణం చూసి, యింకా జవాబు చెప్పక పోగా, "ఆలోచించుకో నియ్యమ్మా" అంది ముసలమ్మ గంగమ్మని.

అయినా జగ్గప్ప మాట్లాడలేదు.

చూడనైనా చూడలేదు.

అది సహించలేక, ముసలమ్మ "జగ్గప్ప చేసే మొదటి కార్యం యిదే కాదూ? అంచేత, అనుభవం లేకా యీజాప్యం. ఒక్క మేడ కట్టాడు, అంతేనా?" అంది గంగమ్మతో.

గంగమ్మ తలవూపి వూరుకుంది.

ఉండుండి పులుకూ పులుకూ చూస్తూ జగ్గప్ప ప్రారంభించాడు.

"సంబంధం విషయమై నీకేమీ అభ్యంతరం లేదు"

"నాకభ్యంతరం యేమిటోయ్?"

"ఇక డబ్బు—"

"నేను నిక్కచ్చి చేస్తున్నా ననుకునేవు సుమా తమ్ముడోయ్"

"అబ్బా! నీధోరణే నీదీ, పరాయి సంబంధం మాట్లాడుతున్నట్టు భావిస్తా వేమిటమ్మా? ఒక్క సంగతి ఆలోచించు. కట్నం లేకుండా నేనూ జానకి నెవరికీ యివ్వను. కట్నం పుచ్చుకోకుండా నువ్వూ యెవర్నీ చేసుకోవు నీకొడుక్కి. అవునా?"

"అవునా అంటే—"

దీర్ఘం తీసితీసి చివరికి మాట నాన్చేసింది గంగమ్మ.

ఈసమయాన, యిందుకోసమే రంగమ్మకూడా వచ్చివుండకపోతే గంగమ్మ కీతటపటాయింపు లేక పోవును.

కాని, "మాట పూర్తి చెయ్యి" అన్నట్టు చూస్తూ, జగ్గప్ప, తల పంకించి వూరుకున్నాడు.

ఇది చూసి ముసలమ్మ చాలా యిదయి పోయింది.

తీరా ముదిగొక్కడికి వచ్చిన వ్యవహారం యిలా స్తంభించిపోవడం ఆమెకి సుతరామూ బాగుండలేదు.

అంచేత, ఆమె కూడా చూసిచూసి "వ్యవహారం వచ్చినప్పుడు ముఖావాలూ, అనుకోడాలూ పనికిరావు; కాని, మొగాడవు నువ్వు కూడా యింత పట్టుపడితే యెలాగ నాయనా? నువ్వెలాగా కట్నం యివ్వతలుచుకున్నప్పుడు, ఆ యివ్వతలుచుకున్న దెంతో—"

తల్లి యిలా అనేటప్పటికి మాటలో మాట కలిపి "నువ్వివ్వవలసినవాడవూ, నేను పట్టుకువెళ్లవలసిన దాన్నినీ. నువ్వెంత యిస్తే నేను కాదంటాను తమ్ముడూ?"

అని బెల్లిస్తూ జారిపోతూవున్న ముసుగు ముందుకి లాక్కుంది గంగమ్మ.

జగ్గప్పకి కోపం చర్రుమంది.

అప్రయత్నంగా గంగమ్మముసుగుమీద పడి అతని కళ్లు చిమచిమ లాడాయి.

భోజనాల సమయాన రొమేష్ చేసిన ప్రసంగం అతని హృదయంమీద కలిగిన గాయం చెయ్యిపెట్టి కెలికిన ట్టయింది.

వెంటనే చురచుర చూస్తూ "అయితేనూ?... వచ్చినప్పణ్ణుంచీ చూస్తూనే వున్నాను; గానీ...... నీ కా ముసు గేమి టమ్మా?" అని గంభీరంగా అడిగాడు.

ఇది విని ముందు చిరునవ్వు నవ్వేసింది గంగమ్మ.

తరవాత జగ్గప్ప నుద్దేశించి "కూపకూర్మం. ఏమి తెలుసునూ?" అన్నట్టు తల్లి కేసి నిరాసకంగా చూసింది.

చివరికి గంభీరంగా చూస్తూ "ఉత్తర దేశం లో సంసారికి ముసుగు లేకపోతే చాలా తప్పట. నలుగురూ గుడ్లు పీకేస్తారుట. అబ్బాయి చెబితే వేసు కుంటున్నా" నని సగర్వంగా చెప్పేసింది.

"మనది దక్షిణదేశం కాదుటమ్మా?"

"అయితే?"

"ఇక్కడ ముసుగు వేసుకోడం యెలాంటి వాళ్లూ?"

జగ్గప్ప ఇలా అడిగేటప్పటికి మనస్సు చివుక్కు మనగా,అవ్యవధానంగా అందుకుని "మనం వుత్తర దేశం వాళ్లమా, పోనీ అంటే, ఆదేశంలో వున్నామా? ఇక్కడ ముసు గెందుకమ్మా?" అని గంగమ్మని లాలించి "రేపణ్ణుంచి మానేస్తుంది లే నాయనా" అని సద్ది చెప్పింది ముసలమ్మ.

కాని, జగ్గప్ప మాట అలా వుండగా యిందుకు గంగమ్మే అంగీకరించ లేదు.

పైగా "యిలాంటి సంగతులు నీకేం తెలుసునే, నాకు చెప్పడానికీ?" అని తల్లిని ముదలకించిం దామె.

"ఐతే, యిందుకు బావగా రంగీకరించారా?"

"మీ బావగా రంగీకరించకపోతే మాత్రం, దేశ దేశాలు చూసిన నాయన మాట కొట్టెయ్యనా? కాక పోయినా, మీ బావగారికి మాత్రం యేమి తెలుసు నోయ్? ఏలూరూ రాజమండ్రీ తప్ప మూడోవూ రెరు గునా ఆయన? చెన్నపట్నంలో కామోసు రెండే ళ్లున్నారు లాకోసం, అంతేనా?"

"విన్నావా?" అన్నట్టు చూశాడు జగ్గప్ప ముసలమ్మకేసి.

గట్టిచిక్కే; కాని, చూసి చూసి జగ్గప్పని కుర్రకుంకగా కట్టేసిం దామె.

ఈదిలాసాతో "పోనిస్తు నాయనా! మన పిల్ల సుఖమూ దర్జా చూసుకోవాలి; గాని వాళ్లేం చేసుకుంటే మనకేం? ముందు కట్నం సంగతి తేల్చేస్తూ నువ్వు" అని కొడుకునే నెపపెట్టింది.

ఒక్క క్షణం కళ్లు మూసుకునీ, మొగం వంచు కునీ వూరుకున్నాడు జగ్గప్ప.

ఆలోచించి ఆలోచించి "యిక వీళ్లతో మా ట్లాడకూడ" దనుకున్నాడు; కాని మనస్సు కెళ్లిం చింది.

చూడగా, వాళ్ల నెత్తిమీద చెయ్యి పెట్టడాని కిదీ వొక మార్గంగానే కనపడిం దతనికి.

వెంటనే "నిన్ను గొం — గ్ గా — మాయ్ అని పిలుస్తా డేమిటమ్మా నీకొడుకూ ?" అని మెల్లిగా అడిగాడు.

జగ్గప్ప యిలా అడగ్గా "ఏమిటో" అని ముందు కులాసాగా నవ్వేసింది గంగమ్మ.

తరవాత "మాతోటికోడలి పేరు మంగమ్మ కాదూ ? నానాయనకి ఆవిడమీద కూడా నామీద వున్నంత భక్తి వుంది. అంచేత, మాయిద్దరికీ భేదం తెలవడానికీ, మమ్మల్ని చూసి యితర్లీపద్ధతి నేర్చు కోడానికీ, ఆవిణ్ణి 'మొం—గ్ గా—మాయ్' అనీ, నన్ను 'గొం—గ్ గా—మాయ్' అనీ పిలుస్తాడు నాయన. అదేమిటో ఆపిలుపు వింటే నాకు ప్రాణాలు లేచివస్తాయి. మాతోటికోడలు పొంగిపోతుంది." అని కళ్లు తిప్పుకుంటూ చెప్పింది.

"హిందీలో పిలిస్తేగాని నీకు ప్రాణాలు లేచి రావూ?"

"ఎలా లేచివస్తాయిరా నువ్వు మరీనీ? హిందీ మాట్లాడేవాళ్లే హిందువులుట. అసలు, బ్రాహ్మలంటే ఆర్యులుట. ఆర్యులది యెప్పుడూ హిందీభాషేట. అంచేత,హిందీలో మాట్లాడుకోకపోతే మనకి బ్రాహ్మణ్యమే నిలవదుట."

"బాగుం దమ్మా బాగుంది"

"నా నాయనపోరుమీద నేనిప్పుడు 'ప్రాథ్మిక్' పరీక్షకి చదువుతున్నాను"

"అది కూడానా?"

"తులసీదాసురామాయణం కొంతయినా చదవకుండా నేను పచ్చిమంచినీళ్లయినా పుచ్చుకోడం లేదిప్పుడు"

"ఉచితంగానే వుంది"

"నా నాయనతో నేను హిందీలోనే మాట్లాడాలి. లేకపోతే నా ప్రాణాలు కొరికేస్తాడతను"

"సంతోషం"

"నేను హిందీ మాట్లాడితే అచ్చంగా హిందీ ఆడాళ్లు మాట్లాడినట్టే వుంటుందిట. నే నా దేశం వెళ్లానంటే చాలా గౌరవం చేస్తారుట వాళ్లు, నాకు"

అవ్యవధానంగా "మామ్మే, మాతల్లే" అంటూ అందుకుని "నీ కింతెంత గౌరవా లయినా జరగవలసిందే. చిన్నప్పణ్నుంచీ నువ్వు తెలివయినదానవే. నువ్వా దేశం వెళ్లేటప్పుడు నన్ను కూడా తీసుకువెళ్లమ్మా, చూసి ఆనందిస్తాను" అంటూ గంగమ్మని కౌగిలించుకుని మురిసిపోయింది ముసలమ్మ.

గంగమ్మమొగంమీద విజయగర్వం అలుముకుపోయింది.

వారి ఆనందానికి భంగం కలక్కుండా వొక్క క్షణం వూరుకుని, తరవాత "అయితే మాత్రం 'గొంగ్‌గా' అనడం యెందు కమ్మా? 'గంగా' అన కూడదూ?" అని అడిగాడు జగ్గప్ప.

"అనకూడ" దంది స్ఫుటంగా గంగమ్మ.

"గొంగ అంటే తెనుగులో శత్రువు అన్నమాట, తెలుసా?" అని మళ్లీ అడిగా డతను.

"వెధవ తెనుగు ఫోనిస్తూ తమ్ముకూ" అని ఆమె చెండుకుని మొగం పక్కకి తిప్పుకుంది.

"సెబాస్" అన్నాడు జగ్గప్ప.

ఇలా అని, సకల సంశయాల భారమూ తీరిపోయినంత తేలిక అనుభవిస్తూ సోఫాకి చేరబడ్డాడతను.

ముగ్గురూ వొక్క క్షణం మౌనంగా వుండిపోయారు.

ఈమౌనంలో, జగ్గప్ప అసంతృప్తుడయి వున్నాడని గ్రహించింది ముసలమ్మ.

దీంతో వెంటనే లేచి, ఆమె "రాత్రి అబ్బాయీ, కోడలూ ఆలోచించుకుని పొద్దున్నే తాంబూలాలిస్తారు లే తల్లీ" అని చెబుతూ గంగమ్మని లేవదీసి కిందికి తీసుకుపోయింది.

జగ్గప్ప దిగ్భ్రాంతుడై అలాగే వుండిపోయాడు.

ఈస్థితిలో "అత్తయ్య చెప్పారు, యెందుకూ రమ్మన్నారుటా?" అని అడుగుతూ వచ్చి, రత్తమ్మ, అతని పక్కని కూచుంది.

తెల్లపోయి "నేను రమ్మన్నానూ?" అన్నాడతను.

"అత్తయ్య చెప్పారు మరి?" అని బదులడిగిం దామె.

ఆమెకేసే చూశాడు; గాని ఆలోచించాడు.

బోధపడింది.

తల్లిఆత్రానికి నవ్వున్నూ వచ్చింది.

ఆనవ్వుతో హృదయం తేరుకుంది.

ఆ తేరుదల మెదటికి చురుకు పుట్టించింది.

దాంతో, కొడుకు హిందీలో పిలిస్తే గంగమ్మకి వచ్చే సంబరంమాట జ్ఞాపకం వచ్చింది.

అది మనస్సును చమత్కరించింది.

వెంటనే "రో — త్ తా—మాయ్" అంటూ గుచ్చి కౌగిలించుకుని, ఆమెని దగ్గరసా తీసుకున్నాడతను.

అమాంతంగా నవ్వు పొంగుకురాగా, కిల కిల్లాడుతూ, అతని వొడిలో వాలిందామె.

"సరే సరే" అంటూ రత్తమ్మ వెంట రాగా రంగమ్మ వచ్చి కారులో కూచుంది.

రామేశం కూడా యెక్కి కూచున్నాడు.

"సమయానికి వొంటరిదాన్నయిపోతున్నాను, తొరగా రావాలి సుమండీ" అని బతిమాలుతూ రత్తమ్మ తలుపు వేసింది.

కొబ్బరికాయలూ, అరటిపళ్లూ, కుంకుమ పొట్లాలూ, హారతికర్పూరమూ — ఇంకా యిలాంటివి వున్న పళ్లెం తెచ్చి రంగమ్మ కందించింది అన్నపూర్ణ.

తల్లియింగితం గుర్తించి రామేశమే చెప్పబోతూ వుండగా, ఇంజన్ స్టార్టుచేసి, స్టీరింగుచక్రం పట్టుకుని "సెలవా?" అన్నట్టు వెనక్కి విరగబడి చూశాడు డ్రయివరు.

జవాబు చెప్పడానికి బదులు, ముందుకి చూస్తూ "మామయ్య" అని ఆత్రపడ్డాడు రామేశం.

చూడగా, హుకుంపేట దాకా షికారు వెళ్లి వచ్చిన జగ్గప్ప కారుముందు నుంచుని వున్నాడు.

దిగుదామని డ్రయివరు తలుపు తీసుకోబోతూ వుండగా "కోటిలింగాలకీ, మార్కండేయస్వామి గుడికీ వెడుతున్నారు చిన్నవదిన" అంటూ పక్కకి వచ్చి నుంచుంది రత్తమ్మ.

"శుభం" అంటూ జగ్గప్ప తప్పుకున్నాడు.

కారు కదిలింది.

* * * *

"అమ్మగారు వర్తమానించారు" అని చెబుతూ, మెట్లమీద కెదురువచ్చాడు, అరుగుమీద నుంచునివున్న సంగీతోపాధ్యాయుడు.

జగ్గప్ప గంభీరంగా చూడగా, ముసి ముసి నవ్వులు నవ్వుకుంటూ రత్తమ్మ మొగం వంచుకుంది.

ఇద్దరూ గుమ్మం దాటారు.

"అమ్మగారు సిద్ధంగా వుండమన్నారు" అని చెబుతూ, పళ్లెంలో అక్షింతలు కలుపుతూ, యెదురు వచ్చి పక్కగా నుంచున్నాడు పురోహితుడు.

జగ్గప్ప మళ్లీ గంభీరంగా చూడగా, చిరాకు చూపులు చూసింది రత్తమ్మ.

ముగ్గురూ మౌనంగా నుంచున్నారు.

చూడగా, ముందువాకి వుత్తరపు హాలంతా జంబుకానా పరిచివుంది.

దానిమీద, పడమటి గోడకి చేర్చి తివాసీ పరిచి వుంది.

తివాసీకి మధ్యగా గోడకి బాలీసు చేర్చి వుంది.

పాటకులు ఉత్తరాభిముఖంగా కూచోడానికనువుగా, తివాసీ అంచున, ఫిడేలు పెట్టే, తంబురా పెట్టి వున్నాయి.

తివాసీ తూర్పు అంచు దగ్గిరగా అగరువత్తుల కూజా ఘుమఘుమలాడిపోతోంది.

దానిపక్కనే తాంబూలపు పళ్లెం వుంది.

జగ్గప్ప విభ్రాంతుడయిపోయాడు.

"పది గడియలకు దుర్ముహూర్తం. అంచేత— తొరగా—" అని మాట తేల్చేశాడు పురోహితుడు.

"ఏమి టిదంతా?" అన్నట్టు జగ్గప్పా, "మరేమి టనుకున్నారూ?" అన్నట్టు రత్తమ్మా చూసుకున్నారు.

కోర్టులో స్వపక్షంగానూ, పరపక్షంగానూ కూడా యెన్నో యెక్సుపార్టీ డిక్రీలు చూసివున్న జగ్గప్పకి తల గిర్రున తిరిగిపోయింది.

దాంతో అప్రయత్నంగా కళ్లు మూతలు పడ్డాయి.

ఇది గుర్తించి చకితుడై, పురోహితుడు, నిశ్చేష్టుడయిపోయాడు.

అదిన్నీ చూశాటప్పటికి రత్తమ్మ గొంతుకు నొక్కుకుపోయిన ట్టయింది.

ఏదో పనిమీద వుత్తరపు వసారాలోకి వెడుతూ, వీరి వాలకం ఆకర్షించగా యిటే చూస్తూ, పనిమనిషి, అడుగులు తడబడుతూ వెళ్లడంలో తలుపుమీద పడి చప్పుడయింది.

దాంతో ముగ్గురూ ప్రకృతిలో పడ్డారు.

దంపతులు పుంఖానుపుంఖంగా చురుకుచూపులు చూసుకున్నారు.

పురోహితుడు కాళ్లీడ్చుకుంటూ తాంబూలపు పళ్లెంకేసి వెళ్లగా, దంపతులు మేడమీది కెగిరిపోయారు.

* * *

భోజనాల హాల్లోకి తీసుకువెళ్లి, యెడమచేత్తో రెక్కా, కుడిచేత్తో గడ్డమూ పట్టుకుని "పెద్దబావ వింటాడు, నువ్వూ అక్కయ్యా చక్కగా పాడండి తల్లీ" అని బెల్లించింది ముసలమ్మ; కాని "నేను పాడను బాబూ" అంటూ మూతి బిడాయించుకునీ, రెక్క విడిపించుకునీ రెండడుగులు వెనక్కి వేసిందన్నపూర్ణ.

"నాతల్లివి కాదూ? మా అమ్మపేరు పెట్టుకున్నాను కాదూ నీకు? నామాట కొట్టేస్తావా? గంగమ్మత్తయ్య పే-ద్ధ బహుమతీ చేస్తుందమ్మా, ఇంచక్కా పాడు, ఏం?" అని మళ్లీ బెల్లించింది ముసలమ్మ. ఐనా నిర్లక్ష్యంగా బుర్ర తిప్పేసిందన్నపూర్ణ.

మొదట, యిది అపశకునంగా భావించి మండిపడి, మిగిలిన రెండు దంతాలూ కొరుక్కుంది ముసలమ్మ.

"అసలు చెడుతుందేమో" అని మళ్లీ నిదానించింది.

"పోనీ, అదిగో, గూట్లో సిద్ధంగా వున్నాయి పళ్లెమూ హారతికర్పూరమూ అవ్వీ, నేను చెప్పినప్పుడు వెలిగించుకు వచ్చి, అక్కయ్యకీ బావకీ నివాళి ఇయ్యమ్మా" అని చివరికి బతిమాలింది.

కాని, మొదట యిది విని తుళ్లిపడి, రాత్రి జరిగిన సంభావణతో మొగం తిరిగిపోయివుండడంవల్ల, తరవాత, ముసలమ్మకంటేనూ మండిపడి, చివరికి "ఛో" అంటూ తుర్రుమంది అన్నపూర్ణ.



దీంతో కొట్టినంత అభిమానపడిపోయింది ముసలమ్మ.

వెనకాలే వెళ్లి వీపు చీరేద్దామా అన్నంత రోషం కూడా తెచ్చుకుంది; గాని, అంతలో కొంచెం తగ్గి "నువ్వుపాడకపోతేనూ, నివాళి ఇవ్వకపోతేనూ దిగడిపోతుందా మేమిటి, మీ అమ్మచేతే యిప్పిస్తాను వాళ్లకి మంగళహారతి, ఛో లంజా" అని రుంజుకుంటూ గంగమ్మదగ్గిరికి వెళ్లిపోయింది.

* * *

తంబురా శ్రుతిచేసి యథాస్థానంలో వుంచి, తాను ఫిడేలు శ్రుతిచేసుకుని సిద్ధంగా కూచున్నాడు సంగీతోపాధ్యాయుడు.

దీర్ఘాలోచనతో మొగం కుంగిపోయివుండగా, బరువులుగా అడుగులు వేసుకుంటూ వచ్చి, తంబురాకి పక్కగా వున్న స్తంభం ఆనుకూచున్నాడు జగ్గప్ప.

రామస్మరణ చేసుకుంటూ వచ్చి, మండువా అంచున మడిగా కూచున్నాడు పురోహితుడు.

గళ్లలుంగీ చుట్టబెట్టుకుని, బీడీలకట్టబరువుకి వూగిసలాడిపోతూవున్న సిల్కులాల్చీమీద పొట్టికోటు తొడుక్కుని, నెత్తిమీద లేసుగుడ్డటోపీ వుంచుకుని, యువరాజుల నడక భావించుకుంటూ వచ్చి, సంగీతోపాధ్యాయుణ్ణి రాసుకుంటూ వెళ్లి, వడిసెల బెడ్డలాగ తివాసీమీద చతికిలబడ్డాడు రామేష్.

అతని వెనకనే సమంగా ముసుగులు సవరించుకుంటూ వచ్చి, ముసలమ్మా గంగమ్మా వుత్తరపు గోడకి చేరబడి కూచున్నారు.

తరవాత, రెక్కపట్టుకు తీసుకువచ్చి జానకిని తంబురాదగ్గిర కూచోబెట్టి, జగ్గప్పవెనక్కి తప్పుకుంది రత్తమ్మ.

జానకివాలకం చూసి జగ్గప్ప వులిక్కిపడ్డాడు.

పల్చని నీలజీమూతశకలంలాగ మర్మాంతికమైన ఆవేదన ఆమెమొగమంతా కమ్మేసి వుంది.

పదహారేళ్ల పిల్ల జానకి.

బంగారు సలాక.

కాని, బేడిసచేపలవంటి ఆమెకళ్లు ఆసమయాన తేజోవిహీనంగా వున్నాయి.

తీర్చి దిద్దబడే వుండినా, లావణ్యం మరుగుపడిపోయి, వెలిసిపోయిన బిళువారీ అద్దం అయిపోయి వుంది ఆమెమొగం.

అయినా నిస్తరంగసముద్రం లాగ అతి గంభీరంగా కూచుని వున్నాడు జగ్గప్ప.

## ౬

రొమేష్ వేషం చూసీ, అతని దురుసుకనం అనుభవించీ, అక్కడి—అప్పటి వాతావరణం భర్జించకా, సంగీతోపాధ్యాయుడు, మందు తిన్నవాడిలా అయిపోయాడు.

జానకి మ్లానముఖం చూసి, తాను "గుడికి మేకను తీసుకువెళ్లే క్షుద్రుని కంటేనూ నికృష్టుణ్ణయిపోయినా" నని కూడా బాధపడ్డాడతను.

ఏమయినా, బరువుగానే అయినా రెప్పలల్లార్చి జగ్గప్ప ఆజ్ఞ యివ్వగా, యీదురోమంటూనే కమానందుకున్నాడతను.

"ఎప్పుడెప్పు"డని యెదురుచూస్తూ వుండినట్టు కమాను, అవ్యవధానంగా ఫిడేలుతీగలు నిమిరింది.

వెంటనే సున్నితమైన మధురఝంకారం వుప్పతిల్లి, అతని రక్తం వుడుకెత్తించి, జానకి హృదయతంత్రులు వూపేసింది.

దీంతో, గురువూ శిష్యురాలూ యీక్షుద్ర వాతావరణాని కతీతులయిపోయారు.

వారి మొగాలు కలకల్లాడాయి.

ఈవిధంగా అయినా, జానకి మళ్లీ వుత్సాహవంతురాలైనందుకూ, ఆమెమొగం యథాపూర్వంగా లావణ్యభరితం అయినందుకూ "అమ్మయ్యా" అనుకుని రత్తమ్మా, "బతికాం" అనుకుని జగ్గప్పా వూపిరి తీసుకుని, వోకర్నొకరు చూపులతో పరామర్శించుకున్నారు.

ఈ సందుబాట్లో కాంభోజిరాగం యెత్తుకుని, వుపాధ్యాయుడు, దిక్సూచిగా వాయించాడు.

అది జానకికంఠంలో ఆవర్తాలు రేపింది.

ఉత్తరక్షణంలో తంబురా ఝూమ్మంది.

దీంతో, అప్పటికి, తనకూ అలాంటి అనుభవమే కలగ్గా, తానూ పాడాలని అన్నపూర్ణ గుబగుబలాడిపోయింది; కాని, దానివల్ల ముసలమ్మకోరిక నెరవేరిపోతుందని మనస్సు బిగపట్టుకుని — అయినా ఆగలేక, నాయనమ్మకంటబడకుండా వుండేటట్టు కుంచించుకుపోయి వచ్చి జానకిపక్కని కూచుంది.

ఇది, జానకికి, ఝంఝామారుతంలో జవజవలాడిపోయే యేలాలతకు అవలంబం దొరికినట్టయింది.

రత్తమ్మ యిందు కానందించినీ్న "నువ్వు పాడవద్దు సుమా" అని అన్నపూర్ణని కళ్లతో నిషేధించింది.

ఇది యెరగని జగ్గప్ప కూడా కళ్లతోనే ఆమెని వారించాడు.

తరవాత, వుపాధ్యాయుడి యెడమపాదం సూచించగా, అన్నపూర్ణ "ఇంతే" అన్నట్టు తల్లికేసి చూస్తూ రూపకతాళం మాత్రం అందుకుంది.

జానకి "ఇతర దైవములవల్ల—నిలను సౌఖ్యమా, రామ ?" అని త్యాగరాజుకీర్తన అందుకుంది.

ఆ యెత్తుగడ చూసి రత్తమ్మా, జగ్గప్పాకూడా చకితులైనారు.

మొగం వంచుకుని, అరగంట చూస్తూ "రామా ! రామా" అని ఆక్రోశిస్తున్నట్టు రాముణ్ణి సంబోధిస్తూ "మతభేదము లేక సదా మదిని మరులుగొన్న తన, కితరదైవములవల్ల సౌఖ్యమా ?" అని అనుపల్లవి జానకి మళ్లీమళ్లీ పాడినప్పుడు రత్తమ్మ హృదయం ఆనందముగ్ధ మయిపోయింది.

మడికట్టుకుని దేవతాపూజ చేస్తున్నట్టు కూచుని వున్న జానకిని చూసిన కంటితో, లేసుగుడ్డటోపీ పెట్టుకుని మిఠాయిదుకాణంమీద కూచునివున్నట్టున్న రొమేష్‌ని చూడలేకపోయాడు జగ్గప్ప.

దీనికి సాయం, రొమేష్ కూడా మొగం ముడుచుకునే వున్నాడు.

ఈకృతీ, యీఘణితీ చూస్తే అతనికి చీమలూ జెర్రెలూ పాకినట్టుంది.

"నాపెళ్లాం పాడుతుం" దని బడాయి చెప్పుకుని, యిలాంటి పాట వుత్తర దేశపువాళ్లకి వినిపించి, యిక తల యెత్తుకు తిరగ్గలమా?" అని తహతహ లాడిపోయా డతను.

"చింతపండుకీ దీనికీ భేదం యేమి" టని కూడా అతను గజిబిజిపడిపోయాడు.

ఈభావం కలిగేటప్పటికి, చంద్రు మని, వుపాధ్యాయుడిమీద యెంతేనా అసహ్యభావం కూడా కలిగిం దతనికి.

"పోవయ్యా, నేర్చుకుపోయావు, మహా—" అని దులిపెయ్యా లన్నంత ఆగ్రహంకూడా ముంచుకు వచ్చింది.

కాని, పోర్టికోలో కారు ఆగిన చప్పుడు సన్నంగా వినవచ్చింది.

ఒక్క క్షణానికి కారు తలుపు వేసిన చప్పుడున్నూ అయింది.

దీంతో, అతను, శాంతి వహించడం తప్పనిసరి అయిపోయింది.

ఉత్తరక్షణంలో, స్నానం చేసి పట్టుతాపితా కట్టుకుని మొగాన గోవిందం బొట్టుంచుకుని కుడిచేత్తో దేవతాప్రసాదం కొబ్బరికాయచెక్క పట్టుకుని రామేశం వచ్చాడు.

దేవతాప్రసాదం పళ్లెంలో వుంచుకుని, అలాగే మడిగా, అతని వెనకనే రంగమ్మకూడా వచ్చింది.

వారిని చూసి తాను నోరు జారనందుకు చాలా ధన్యవాదాలు చెప్పుకున్నాడు రామేష్.

అప్పటికి, "మనసు దెలిసి బ్రోచినను, మరచినను నీవే! తనవా డన తరుణ మిదే, త్యాగరాజసన్నుత!" అని చరణం పాడుతూ సంగతులమీద సంగతులు వేస్తోంది జానకి.

వారి రాకతో రత్తమ్మమొగం వికసించింది.

జగ్గప్ప, యేదో పెద్ద ఆసరా దొరికినట్టు అనుభూతి పొందాడు.

అన్నపూర్ణ యెగిరిపడ్డట్టయింది.

ముఖ్యంగా, జానకికి ప్రాణాలు లేచివచ్చాయి.

జానకి పాట వీథిలోనుంచే వింటూ రామేశమూ, రంగమ్మా చకితులైనారు; కాని, అక్కడ నుంచో కఉత్తరపుహోలుకేసయినా చూడకుండా, ముందు దక్షిణపు వసారాలోకీ, తరవాత అక్కణ్ణుంచి మేడమీదికీ వెళ్లిపోయారు వారు.

అయినా "సమయానికి వచ్చారే, శకునిపక్షుల్లాగా" అని ముసలమ్మా, "వస్తే మాత్రం? కళ్లల్లో నిప్పులు పోస్తాను చూస్తూ వుండు" అని గంగమ్మా జనాంతికంగా పళ్లు కొరుక్కుని, మాతులు బిడాయించుకున్నారు.

ఈ గందరగోళంలో కృతి పూర్తి ఐపోయింది.

౭

పాడినందుకు మెప్పూ కనపడక, పాడడానికి మరి యిచ్ఛా లేక "యిక పాడలే" నన్నట్టు జానకి జాలిగా చూడగా, "మాఅమ్మవు కావూ? ఇంకొక్కటి" అన్నట్టు రత్తమ్మ కనుసన్న చేసింది.

జగ్గప్ప కూడా "యేదో యింకోటి పాడెయ్యవమ్మా" అన్నట్టు తల యెగరవేశాడు.

"పాడవే మాతల్లీ" అన్నట్టు గునిసింది అన్నపూర్ణ.

జన్మాని కల్లా అప్పుడే విలక్షణానందం రుచి చూసిన పురోహితుడు "చిలకలా పాడావు, మరొక్కటి కూడా పాడమ్మా" అని నోరారా అడిగాడు.

రామేష్‌ఉ, మెరుపుకొట్టినట్టయి, ఫులుకూ పులుకూ చూశాడు; గాని అప్పటి కప్పుడే మళ్లీ శ్రుతి సరిచేసుకుని, జానకియింగితం గుర్తించి హరికాంభోజి యెత్తుకుని వొక్క విసురు విసిరాడు సంగీతోపాధ్యాయుడు.

అన్నపూర్ణకి రూపకతాళం అందించి, "ఉండేదీ రాము డొకడు - ఊరక చెడిపోక మనస" అని మళ్లీ

త్యాగరాజుకీర్తన యెత్తుకుంది జానకి, తల్లికేసి చూస్తూ.

అన్నపూర్ణ కూడా తల్లికేసి చూస్తూ చిరునవ్వు నవ్వింది.

మొదట చకితుడై, తరవాత మొగం పైకెత్తుకుని స్తంభంఆసరాతో వెనక్కి విరగబడి "నీకోసం పాడుతోం దది" అన్నట్టు రత్తమ్మకేసి చూశాడు జగ్గప్ప.

రత్తమ్మమొగం ప్రఫుల్లపద్మం అయింది.

ఉత్కటానందంతో జానకికణతలమీద కళ్లతోనే మెటికలు విరిచి, కళ్లతోనే సీమంతం కూడా ముద్దుపెట్టుకుం దామె.

ఈకీర్తన అంటే ఆమెకి నిద్రాహారా లక్కర్లేదు.

తెల్లవారగట్ల యిది పాడించుకుని విని గాని ఆమె కళ్లు విప్పదు.

మళ్లీ రాత్రి కూడా, జానకిమంచంమీద కూచుని, పాడించుకుని మరీ నిద్రకి వెడుతుం దామె.

పెళ్లిచూపులకోసం యిద్దరు పెళ్లికొడుకులు వచ్చివుండడంవల్లా, వారిలో వొకడు అతీతుడు కూడా అయివుండడంవల్లా, గతరాత్రీ ఆవేళ తెల్లవారగట్లా మాత్రం పాడించుకోలే దామె.

ఇందువల్ల యేదో లోటు అనుభవిస్తున్నట్టామె మనస్సు పీకుతూనే వుంది.

అంచేతనే జానకి యిది ప్రారంభించింది.

ఇలాంటి అసందర్భం వచ్చినప్పుడు, అది గడిచిపోయాక యేం చెయ్యాలో జానకి కెరుకే.

అయినా, అసందర్భం మధ్యనే యిప్పుడిలాగ చక్కని అవకాశం రావడం ఆమెకి వరం దొరికినట్టయింది.

ఇలాంటి తృప్తితోటీ, యిలాంటి వుత్సాహం తోటీ,

"చండమార్తాండమధ్య-

మండలమునను చెలంగు చుండేదీ"

అని అనుపల్లవి రెట్టించిం దామె.

బాహ్యదృష్టి మరచిపోతున్నట్టామెకళ్లు అరమూతలు పడ్డాయి.

దీంతో రత్తమ్మకి విశ్వరూపసందర్శనం అయినట్టయింది.

అప్పటికప్పుడే జగ్గప్పహృదయంకూడా విప్పారింది.

"రాము డున్నాడు; కాని యిక్కడ లేడు. ఉన్నవాడు రాముడు కాడు — మహా బాగా తేల్చేశావు తల్లీ!" అనుకుంటూ పొంగిపోయా డతను.

ఈ పొంగు అతని మొగంమీద మెరు పయింది.

ఆ మెరుపు జానకిశోణాధరంమీద మల్లెపువ్వులు పూసింది.

దాంతో, జానకికంఠాన వాగ్దేవి ప్రవేశించినట్టూ, ఫిడేలు తీగల మాటున గండుగోయిల నక్కికూచున్నట్టూ అయింది.

ఈస్థితిలో,

"తామసాది గుణరహితుడు,

ధర్మాత్ముడు, సర్వసముడు,

క్షేమకరుడు, త్యాగరాజ

చిత్తహితుడు జగము నిండి— ఉండేదీ—"

అని చరణం అందుకుని, ఆవర్తించి పాడింది జానకి.

కంఠం గద్గదికమై, లలాటం స్విన్నమై, మనస్సు పరవశమై, హృదయం ఆనందముగ్ధమై, దృష్టి శ్రీరామనిష్ఠమై పాడిం దామె.

ఆమెమొగాన విలక్షణ మైన తేజస్సు మెరిసిపోయింది.

అది చూసి రత్తమ్మా, జగ్గప్పా మళ్లీ చకితులైనారు.

పురోహితుడున్నూ ఆ స్వరకంపన కూగిపోయాడు.

కాని, గంగమ్మా ముసలమ్మా ముసుగుల్లోనే కాక, డబ్బురంథిలో కూడా మునిగిపోయివున్నారు.

ఇందుకు తగ్గట్టు, జానకిపాటలో సారస్యం యెక్కువయినకొద్దీ రొమేష్‌హృదయంలో వైరస్యం పెరిగిపోయింది.

అసలు, రెండో కీర్తనే యెత్తుకోవద్దని మందలించా లనుకున్నా డతను.

ఎలాగా ప్రారంభించింది కనక, తన యింగితం గుర్తించి, జానకి "అది యేదోవిధంగా తేల్చి పాడెయ్యకపోదు" అని కూడా ఆశించుకున్నా డతను; కాని అత నిలా ఆశించేటప్పుడే ఆమె పరవశ అయిపోయింది.

చివరికి, వుపాధ్యాయుడు కూడా చకితుడయిపోయేటంత గంభీరంగానూ, మధురంగానూ పాడిందామె.

ఇది రొమేష్‌కి కొరడా కొసలాగ గుండెలకు చుట్టబెట్టుకుంది.

అత నిక వూరుకోలేకపోయాడు.

దీంతో వుపాధ్యాయుడు ఇటు ఫిడేలు కిందపెట్టగా, రొమేష్ ఉ మొగమాటం అటు దూరంగాపెట్టి "ఇలాంటి పాడుపాటలు నేర్పి మీ రెంతమంది పిల్లల్ని పాడుచేస్తున్నారండీ?" అని దురుసుగా అడిగాడు.

ఉపాధ్యాయుడు తెల్లబోయాడు.

ఉలిక్కిపడి జానకీ, అన్నపూర్ణా వుపాధ్యాయుడికేసి చూశారు.

రత్తమ్మ స్తంభాని కంటుకుపోయింది.

అప్పటికి ప్రకృతిలో పడ్డాడు జగ్గప్ప.

"ఏమి" టన్నా డతను.

"నీవంటివాడు కూడా యిలా పామరత్వం కనపరచడం బాగాలేదు మామయ్యా" అన్నాడు రొమేష్ ఉ.

సరిగా బోధపడక "ఏమిటోయ్ నువ్వనేదీ?" అని మళ్లీ అడిగాడు జగ్గప్ప.

"ఇది పాటకాదు" అని వొత్తిచెప్పాడు రొమేష్ ఉ.

జగ్గప్ప మిడుతూ మిడుతూ చూశాడు.

"ఇది సంగీతం అంతకంటే కాదు" అని చెండుకున్నాడు రొమేష్‌ఉ.

"ఏమిటీ వుప్పెన?" అన్నట్టుపాధ్యాయుడికేసి చూశాడు జగ్గప్ప.

ఉపాధ్యాయు డేదో అనబోయాడు; కాని "నువ్వాశ్చర్యపడితే లాభం లే" దంటూ అవ్యవధానంగా మళ్లీ అందుకున్నాడు రొమేష్ ఉ.

"కర్నాటగానం అనబడే కూతలతోటీ, త్యాగరాజుపడవపాటలతోటీ, తెనుగుదేశం వొక్కటే కాదు, దక్షిణదేశానికి దక్షిణదేశమే పర్రా దిబ్బా అయిపోయాయి."

"మరి సంగీతం యే దంటావ్?"

"హిందూస్థానీ సంగీతమే సంగీతం"

జగ్గప్ప గతుక్కుమనిపోయాడు.

పురోహితుడికేసి చూస్తూ వెటకారంగా నవ్వాడు వుపాధ్యాయుడు.

జానకీ, అన్నపూర్ణా మొగాలు చిట్లించుకున్నారు.

"హిందూస్థానీసంగీతం వినగలిగిందే జన్మ. అది విని ఆనందిస్తేనే రసికత. దాన్ని స్వీకరించినప్పుడే దక్షిణదేశంవాళ్లకి మోక్షం. అప్పుడే వాళ్లకి హిందుత్వసిద్ధిన్నీ" అని మళ్లీ వొత్తిచెప్పాడు రొమేష్‌ఉ.

ఆ చెప్పడంలో ఆవేశం కూడా కనపరిచాడు.

"సత్యం ఆవిష్కరించా" ననీ, "జాతీయతను దొలిచివేస్తున్న చీడపురు గేదో దాన్ని బయటపెట్టగలిగా" ననీ కూడా అతను తృప్తిపడ్డాడు.

కాని, దాంతో, జగ్గప్పకి రొమేష్ నిజస్వరూపం నిలువునా అర్థం అయిపోయింది.

రత్తమ్మకి తలే తిరిగిపోయింది.

జానకీ, అన్నపూర్ణా వుబ్బెత్తుగా లేచి భోజనాల హాల్లోకి వెళ్లిపోయారు.

"ఏం, వెళ్లిపోతా రేమర్రా?" అని ముసలమ్మ ఆత్రంగా అడిగింది; కాని ఆమె కెవరూ బదులు చెప్పలేదు.

తన కొడుకన్న మాటలతో పరవశ ఐపోయి, మళ్లీ తల్లిఆత్రంతో ప్రకృతిలో పడి, గంగమ్మ తల్లి చెవిలో నోరు పెట్టి "ఇలాంటి నోముల పాటలు పే అబ్బాయియెదట పాడవలసినవీ? చూడు, మూడు ముళ్లూ పడిపోనియ్యి, తరవాత జానకమ్మకి యేలాంటి సంగీతం నేర్పిస్తాడో నాయన?" అని కళ్లు తిప్పుకుంటూ గొణిగింది.

సరిగా, యీసమయాన, బ్రరెగొడ్డు అరుపు లాగ హార్మోనియం వాద్యమూ, దాల్లో కలిసి వొక స్త్రీకంఠమూ వినిపించాయి.

అందరూ వులిక్కిపడ్డారు.

రామేష్ మొగం చేట అయిపోయింది.

వెంటనే, ద్వారంకేసి తర్జనితో నిర్దేశిస్తూ "అదిగో, అదీ సంగీతం. వస్తా నుండండి" అని చెబుతూనే గభీ మని లేచి, బయటికి దూకాడతను.

౭

మేడమీది దక్షిణపు హాల్లో స్తంభంచాటున నుంచుని, వుండుండి మండువా తెరిపిలోనుంచి కిందికి చూస్తూ వుండిన రంగమ్మ, సోఫాలో కూచుని నిశ్చింతగా వార్తాపత్రిక చదువుకుంటూ వున్న రామేశానికిదంతా చెప్పింది.

వింతపడి, మండువా వూచల దగ్గిరికి వచ్చి నుంచున్నాడతను.

అప్పటికి, రామేష్ ఉ "దయ చెయ్యండి. అచ్చమైన హిందూసంగీతం వినిపించి యీ దరిద్రులను అనుగ్రహించండి" అంటూ లోపలికి వచ్చాడు.

ఈ మాటలు హిందీలోనే అంటూ వచ్చాడు.

అతని వెనక, నవారుతాటితో హార్మోనియం మెడకి వేలాడవేసుకుని వున్న పదిహేను పదహారేళ్ల కుర్రాడు వచ్చాడు.

వస్తాదుకట్టు కట్టుకుని, షేర్వాణీ తొడుక్కుని లేసుగుడ్డటోపీ పెట్టుకుని—పైగా, మురికివోడుకుంటూ వున్నాడు వాడు.

వాడి వెనక, పదిపద్ధెనిమిదేళ్ల యువతివచ్చింది.

లంగా కట్టుకుని, లాల్చీవంటి చొక్కా తొడుక్కుని, జారుపైటా ముసుగూ వేసుకుని వుందామె.

ఆమెకూడా మురికి వోడుకుంటూనే వుంది.

అక్కడి పరిసరాలు చూసి, వాళ్లొకమాటు మొగమొగాలు చూసుకున్నారు.

ఈ వ్యవధిలో వాళ్ల. సాన్నిధ్యం భరించలేక, సంగీతోపాధ్యాయుడు ఫిడేలూ తంబురా పుచ్చుకుని లేచి వెళ్లి పురోహితుడి పక్కగా తొలగి కూచున్నాడు.

ఇదేదో కొంచెం చూసే వెడదామన్న వుద్దేశంతో వెనక్కి వెళ్లి మరో స్తంభం ఆనుకు నుంచుంది రత్తమ్మ.

చురుగ్గా చూస్తూ జగ్గప్ప అక్కడే, అలాగే వుండిపోయాడు.

భోజనపు హాలు కిటికీ తలుపులు సగం మూసుకుని వుండి జానకీ, గుమ్మంలో నుంచుని అన్నపూర్ణా యీ మహోత్సవం చూడ సాగారు.

జాప్యం సహించలేక "దయచెయ్యండి" అన్నాడు, మళ్లీ హిందీలోనే రామేష్.

"తల్లీ, కూచోండి. ఈ కుబేరపుత్రుణ్ణి మెప్పించండి, నేను మీకు బహుమతీ చేస్తాను" అని తివాసీ చూపిస్తూ గంగమ్మ కూడా హిందీలో చెప్పింది.

ముసలమ్మ "యిప్పుడేమిటే మాయ సంత" అని చీదరించుకుంది; గాని, గంగమ్మకీ రామేష్‌కీ యెదురు చెప్పలేక కళ్లప్పగించి వూరుకుంది.

అప్పటికి కూచున్నాడు కుర్రాడు "మంచిది" అని హిందీలోనే అని తలపంకించుకుంటూనూ, హార్మోనియం ముందుకి తీసుకుంటూనూ.

చూసిచూసి యువతి కూడా కూచుంది, లంగా చక్రాకారంగా పడేటట్టు.

వెంటనే, హార్మోనియం బర్రు మంది.

దాంతోనే, యువతి కంయ్యి మంది.

ఉలిక్కిపడి, తొంగిచూసి, కంఠం నొక్కుకుని "అదేమిటి నాయనా?" అంది రంగమ్మ.

"రొమేష్ మోషాయ్ పెళ్లి కాదుటమ్మా?" అన్నాడు రామేశం.

ఈ సమయాన, పురోహితుడు, యాదాలాభం గా పైకి చూశాడు.

వారక్కడే యెందు కుండిపోయారో బోధ పడక, అతను, కళ్లు చికిలించుకుని వారిని సంగీతోపాధ్యాయుడికి చూపించాడు.

భావకవి పెణక లెగరకొడుతూ వుండగా, వచ్చేదారీ పోయేదారీ తెలవక మహాకవి తెల్లపోయి చూస్తూ కూచుని వుండేటట్టు, దిగ్భ్రాంతు డయిపోయి వున్నాడు పాపం అతను.

ఇలాంటి స్థితిలో వారు కనపడగా, రామేశం పరిచితు డయివుండడంవల్ల "దయ చెయ్యండి" అన్నట్టు కన్ను గీటా డతను.

మందహాసం చేసి, "రాకూడదు, తప్పు" అన్నట్టు ముక్కుమీద వేలుంచుకుని, తరవాత, రామేశం, ఢోలు స్ఫురించేటట్టూ, అది తప్పు వయినట్టూ చేసన్న చేసి సోఫామీదకి వెళ్లిపోయాడు.

ఆకాశగంగలా పురకలు వేసుకుంటూ నవ్వు రాగా, మళ్లీ మళ్లీ గమ్మున ఆపుకునీ, వుండుండి ఫక్కు మనపోయి వూగిపోయాడు సంగీతోపాధ్యాయుడు.

ఇక్కడ యిది యిలా వుండగా, అక్కడ ట్రిముల మీద ట్రిములు వెళ్లిపోతున్నాయి.

"సెబాస్" "ఛాలా బాగుంది" "భలే భలే" "వా వా" అని మధ్యమధ్య పాటకత్తెను హిందీలో మెచ్చుకుంటూ "ఏమనుకున్నారు?" "చూసుకోండి" "సిగ్గుపడండి" "బుద్ధితెచ్చుకోండి" అన్నట్టు మధ్యమధ్య ఆడపెళ్లివారిని కళ్లల్లో డెకారిస్తూ, అభంగ ఉత్తుంగ ఆనంద తరంగాలమీద—అలా —అలా— తేలిపోతున్నాడు రొమేష్.

"వీళ్ల మొహం వీళ్లకేం తెలుసు, నిజమైన సంగీతం అదేనే. అది చెవిని పడిందంటే నాయన యిక మనలో వుండడే" అని ముసలమ్మతో సారకాయలు నరికేస్తోంది గొం—గ్ గా—మాయ్.

కొంతసేపటికి, యీ పొగడ్తా యీ ప్రచారమూ వుత్సాహం కలిగించి యెత్తెయ్యగా, ఉబ్బెత్తుగా లేచి నుంచుంది యువతి.

హార్మోనియం మళ్లీ మెడకి తగిలించుకుని కుర్రాడు కూడా అంత లాఘవంగానూ యెగిరినుంచున్నాడు.

పడవ తెడ్లలాగ చేతు లూపుకుంటూ అవ్యవధానంగా, థెయ్యిమని నాటకం తొక్కసాగింది యువతి.

ఆవేశంవల్ల వొకమాటీభుజానికీ, మరోమాటు ఆ భుజానికీ గడ్డం తగిలేటట్టు మొగం మార్చుకుంటూ, మెయిలువేగంతోటీ అదే నినాదంతోటీ వేళ్లాడిపోతూ వున్న హార్మోనియం మీటుకుంటూ మెరుపు వేగంతో ఆమె చుట్టూ తిరగసాగాడు కుర్రాడు.

ఆ చురుకుదనమూ, ఆ చాకచక్యమూ చూసి ముగ్ధ డయి, ఆ నృత్యానికి మరింత మాధుర్యం కలిగించి తద్వారా తాను మరింత ఆనందించగోరి, రొమేష్ ఉ, కుడిచేతి తర్జనితో నాలుక మడతవేసుకుని యెగరొప్పుల్లాగ యీలలు వెయ్య సాగాడు.

ఆయీలతో మహోత్సుక అయి, యువతి గిరగిర తిరిగింది. గిర్రున తిరిగేసింది.

దాంతో ఆహాలంతా ముఖరితం అయిపోయింది.

ఆ ప్రతిధ్వనికి యెగిసివచ్చి, సోఫాలో కూచుని వున్న రామేశమూ, అప్పటికీ స్తంభం చాటునే వున్న రంగమ్మా మండువా తెరిపి వూచల అంచున కూలబడ్డారు.

వొళ్లు మరిచిపోయి, యువతి, భరత శాస్త్రంలో వున్నవీ లేనివీ కలిపి అడ్డమైన ముద్రలూ పట్టేసింది.

ఇలాగ వొక్క పావుగంట జరిగింది.

చివరికి, యెగిరియెగిరి అలిసిపోయి యువతీ, తిరిగితిరిగి బడలిపోయి కుర్రాడూ చతికిలబడ్డారు.

• నాలుక పీక్కుపోయి, రొమేష్ ఉ, అప్పటికి అసలైన స్థాయి అందుకున్నాడు.

కొడుకురసానుభూతి చూసుకుని, గంగమ్మ గర్వపర్వతశిఖరం యెక్కేసింది.

వారి యిద్దరి గొప్పతనమూ మరింత బాగా తెలుసుకుని, ముసలమ్మ, బోసినోరు తెరుచుకుని కళ్లు తేలవేసుకుంది.

ఆడపెళ్లివారు, ఏమి జరుగుతోందో తెలవకా, అర్థం కాకా, చివరికి కనపడకా జడావస్థలో పడిపోయారు.

ఇలాగ, మనుష్యులే కాక, హాలంతా కూడా అవ్యక్తావస్థలో భాసిస్తూ వున్న యీ సమయాన, ఎప్పుడు, ఎలా వచ్చిందో, నాయనమ్మ చూపించిన పళ్లెంలో హారతి కర్పూరం వెలిగించుకు వచ్చి, తివాసీ అంచున నుంచుని వుంది అన్నపూర్ణ.

వేదజడుడు కావడంవల్ల రసానుభూతి తక్కువ కాగా, అందరికంటేనూ ముందుగా మైకం వదిలి పురోహితుడు, అమాంతంగా లేచి నుంచుని,

"శుభికే శిర ఆరోహ శోభయంతీ ముఖం మమ-ముఖగ్ం హి మమ శోభయ భూయాగ్ంసం చ భగం కురు—"

ఇత్యాదిగా మంగళహారతిసామయికం అయిన మంత్రం అందుకున్నాడు.

అతని పక్కనే వున్నాడు కనక, ఆ పవిత్రవేదఘోషవల్ల వుత్తరాదిభూతబాధ విముక్తి కాగా, వెంటనే ప్రకృతిలో పడి, సంగీతోపాధ్యాయుడు, పుణ్యకాలం మించిపోతోందని ఆదుర్దాపడి గభీమని ఫిడేలందుకుని, ఫెడీమని కమాను వేసి—

"నీ నామరూపములకు-నిత్య జయమంగళం."

అన్న త్యాగరాజు సౌరాష్ట్రిరాగం కీర్తన యెత్తుకుని, పల్లవి మాత్రం మూడు మాట్లు ఆవర్తించి వూరుకున్నాడు గాని—

అప్పటి కప్పుడే రామేష్‌కీ యువతికీ కలిపి నివాళి యిచ్చి, పళ్లెం కింద వుంచేసి, అన్నపూర్ణ, భోజనాల హాల్లోకి తుర్రోమంది.

